కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ శుక్రవారం 10 జనవరి 2025
సంపుటి: 14, సంచిక: 282 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## రేవంత్ విదేశీ పర్యటనకు కోర్టు అనుమతి



**హైదరాబాద్ జనవరి 9 (నిఘా న్యూస్):** ఈ నెల 13 నుంచి 24 వరకు బ్రిస్బేన్, దావోస్ లో పర్యటించేందుకు సీఎం రేవంత్ రెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్ బెయిల్ కోసం అప్పట్లో పాస్పోర్టును కోర్టుకు అప్పగించారు. త్వరలో పలు దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉందని, 6 నెలలు పాస్పోర్ట్ ఇవ్వాలని ఆయన అభ్యర్థించగా కోర్టు అంగీకరించింది. జులై 6 లోగా పాస్పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించింది.

## జగన్ యూకే వెళ్లేందుకు కోర్టు అనుమతి

ఈ నెల 11 నుంచి 30వ తేదీ వరకు జగన్ యూకే పర్యటన



2

# నేను సచ్చినా... లుచ్చా పనులు చేయను

నేను రేవంత్ రెడ్డి లా అడ్డంగా దొరికిన దొంగను కాను

రేవంత్ రెడ్డి రాసిచ్చిన ప్రశ్నలనే అధికారులు అడిగారు

ముగిసిన కేటీఆర్ ఏసీబీ విచారణ

నన్ను ప్రశ్నలు అడిగేందుకే అధికారులు ఇబ్బంది పడ్డారన్న కేటీఆర్



**హైదరాబాద్ జనవరి 9(నిఘా న్యూస్):** ఫార్ములా ఈ-రేసు కేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణ ముగిసింది. ఆరు గంటలకుపైగా సాగిన విచారణలో పలు కీలక అంశాలపై ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. సంక్రాంతి తర్వాత కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు మరోసారి విచారించ నున్నారని సమాచారం. గురువారం లాయర్ రామచంద్రరావుతో కలిసి కేటీఆర్ విచారణకు హాజరయ్యారు. డీఎస్పీ మజీద్ ఖాన్, ఏసీబీ జేడీ శివరాం శర్మ, జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ దాదాపు ఆరున్నర గంటలపాటు కేటీఆర్‌ని విచారించారు. ఈ ప్రక్రియను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాదికి ఏర్పాట్లు చేశారు. కాగా, విచారణ నేపథ్యంలో ఏసీబీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణ సందర్భంగా ఏసీబీ అధికారులు పలు కీలక ప్రశ్నలను కేటీఆర్ ముందుంచారు. హెచ్ఎండీఏ నిధుల దుర్వినియోగంపైనే వరుసగా ప్రశ్నలు ..మిగతా 2లో



2

## సుప్రీంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్

ఈనెల 15న విచారిస్తామన్న చీఫ్ జస్టిస్ ఖన్నా

# అమల్లోకి వచ్చిన... భూ భారతి

వ్యక్తిగత ప్రయోజనాల కోసం రెవెన్యూ వ్యవస్థను విచ్ఛిన్నం చేసిన బిఆర్ఎస్

బిల్లుకు ఆమోద ముద్ర వేసిన గవర్నర్

- త్వరలో భూ భారతి మార్గదర్శకాలు
- ఆర్వోఆర్-2020ని పూర్తిగా ప్రక్షాళన
- ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి నియామకం
- సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టం
- ఇక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95 శాతం పూర్తి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి



**హైదరాబాద్ జనవరి 9 (నిఘా న్యూస్):** భూ భారతి-2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇది చట్టరూపం దాల్చింది. గవర్నర్ ఆమోదం తెలపటంతో వీల్కైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీల్కైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ..మిగతా 2లో



## వైకుంఠ ఏకాదశిని 10 రోజులు ఎందుకు చేశారో?

వైకుంఠ ఏకాదశి ద్వాదశి, రెండు రోజులు పవిత్రమైనవి

తిరుపతి ఘటన నా మనసును కలచివేసింది

తిరుమల పవిత్రతను కాపాడే బాధ్యత నాది

ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం: మీడియాతో సీఎం చంద్రబాబు

**తిరుపతి జనవరి 9 (నిఘా న్యూస్):** తిరుపతి సంఘటన చాలా బాధాకరమైన ఘటన అని ఇది మనసును కలచివేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం టీటీడీ పరిపాలన భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఎప్పుడూ మనసా వాచా ఎలాంటి అపశ్రుతీ జరక్కూడదు. పవిత్రమైన దివ్యక్షేత్రంగా ఎప్పుడూ నిలబెట్టాల న్నదే తన తాపత్రయమన్నారు. ఓ భక్తునిగా, ముఖ్యమంత్రిగా తిరుమల దివ్యక్షేత్ర పవిత్రతను కాపాడే బాధ్యతను ఎప్పుడూ తీసుకుంటున్నానని ఇకపైనా తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. సంఘటన స్థలాన్ని చాలా నిశితంగా పరిశీలించి, ఆసుపత్రికి వెళ్లి అందరితోనూ మాట్లాడానని కొందరు తమ కుటుంబ సభ్యుల్ని, బంధువుల్ని, గ్రామస్థుల్ని పోగొట్టుకున్న వారు ఉన్నారని, వారితోనూ మాట్లాడినట్లు తెలిపారు. అనంతరం కార్యాలయంలో సమీక్షించామని, అన్ని కోణాల్లోనూ సమాచారం ఉంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సరైన నిర్ణయాలు తీసుకోవాలనేది తన ఉద్దేశమని తెలిపారు. బోర్డు ఛైర్మన్, ఈవో, సభ్యులకు కూడా స్పష్టమైన ఆదేశాలిస్తున్నా. నిర్ణయాలపై బోర్డులో చర్చించి, వాటిని అమలుచేస్తారు. ఈ పవిత్ర క్షేత్రంలో అసమర్థతతోగానీ అనాలోచిత చర్యల వల్లగానీ చేసిన పనుల ..మిగతా 2లో





## ప్రవాసీ భారతీయ రైలును ప్రారంభించిన ప్రధాని

45 ఏండ్ల నుంచి 65 ఏండ్లు ఉన్నవారు ప్రయాణం చేయవచ్చు

టూరుకు చెందిన అన్ని ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది

**భువనేశ్వర్ జనవరి 9 (నిఘా న్యూస్):** విదేశీ భారతీయుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించింది. భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ఈ రైలును వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎన్ఆర్ఐ టూరిస్టుల కోసం ఈ రైలును స్టార్ట్ చేశారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ ..మిగతా 2లో

## తొక్కిసలాట ఘటనపై... రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి



**న్యూఢిల్లీ జనవరి 9(నిఘా న్యూస్):** తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆమె కోరారు. ఈ మేరకు ఆమె సోషల్ ..మిగతా 2లో

# టీటీడీ ఈవో నిర్లక్ష్యంతో.... మేము తిట్లు తింటున్నాము

మృతుల ఇళ్లకు వెళ్లి క్షమాపణలు చెప్పండి

- బాధ్యతల నిర్వహణలో అధికారుల విఫలం
- భక్తులకు గంటలోనే దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలి
- తిరుపతిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**తిరుమల జనవరి 9 (నిఘా న్యూస్):** తొక్కిసలాట ఘటనకు తితిదే ఈవో, ఏఈవో బాధ్యత తీసుకోవాలని, ఘటనా స్థలిలో ఉన్న పోలీసులు కూడా బాధ్యత తీసుకోవాలని, తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. అధికారులు చేసిన తప్పులకు మేం ..మిగతా 2లో





## గోవింద నామాలు ప్రతి ధ్వనించాల్సిన చోట మృత్యుఘోష

మొన్న లడ్డూ.. ఇప్పుడు తొక్కిసలాట

వైకుంఠ ద్వారం కాదు.. వైకుంఠానికే పంపారు

తిరుపతి ఘటనపై మండిపడ్డ పీసీసీ చీఫ్ షర్మిల

2

## తొక్కిసలాట ఘటనలో.... అధికారుల సస్పెన్షన్

డీఎస్పీ రమణకుమార్,

గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిపై వేటు

ఎస్పీ సుబ్బరాయుడు,

జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ల బదిలీ

ఇవో సహా అధికారుల తీరుపై

చంద్రబాబు ఆగ్రహం

2



## జగనన్న కాలనీలో బియ్యపు రెడ్డి అవినీతి 150 కోట్లు

బియ్యపు మధుసూదన్ రెడ్డిని వదిలే ప్రసక్తే లేదు

రెవెన్యూ సదస్సులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల

**శ్రీకాళహస్తి జనవరి 9 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి నియోజక వర్గంలో గత ఐదేళ్ల వైయస్సార్ పార్టీ పరిపాలనలో బియ్యపు మధుసూదన్ రెడ్డి, అతని అనుచరులు అవినీతి మొత్తం బయటకు తీసి సత్వర చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి మండలం ఊరందరు జగనన్న లేఔట్స్ ప్రాంతంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ ప్రాంత రైతులు లబ్ధిదారులు రెవెన్యూ అధికారులు హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులు హాజరైనారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జగనన్న లేఔట్స్ కు భూములు ఇచ్చిన రైతుల దగ్గర బలవంతంగా మామూలు వసూళ్లు చేశారని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు 60 శాతం. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి 40 శాతం ప్రభుత్వ పరిహారం పంచుకోవడం జరిగిందని తెలిపారు. ఈ రకంగా మొత్తం లెక్కలు వేస్తే ఊరందూరు జగనన్న లేఔట్స్ లో 100 కోట్ల రూపాయలు బియ్యపు మధుసూదన్ రెడ్డి అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. భూములకు గలిగిన రైతులకు ఇవ్వవలసిన సొమ్ములు మొత్తం మాజీ ఎమ్మెల్యే దోసుకున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఏమీ డెవలప్ చేయక సుమారు పది కోట్ల రూపాయలు దిగమింగారని తెలిపారు. జగన్ లేఔట్స్ లో రోడ్లు వెయ్యకనే వేసినట్లు నిధులు దుర్వినియోగం చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు.



### తొక్కిసలాట ఘటనపై...
## రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

మొదటి పేజీ తరువాయి...

మీడియాలో పోస్ట్ చేశారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో చాలా మంది మరణించారని తెలిసి బాధపడ్డాను. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని రాష్ట్రపతి ముర్ము ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుపతి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం పట్ల సంతాపం తెలిపారు. ఈ మేరకు ఎక్స్ పై ఒక పోస్ట్‌లో ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. 'ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన తొక్కిసలాట బాధాకరం. తమ సన్నిహితులను మరియు ప్రియమైన వారిని కోల్పోయిన వారి పట్ల నా సానుభూతి. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను. బాధితులకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. తిరుమల కొండలపై వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం బుధవారం రాత్రి వందలాది మంది భక్తులు పోటీ పడుతుండగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించగా, డజన్ల కొద్దీ మంది గాయపడ్డారు.

## నేను సచ్చినా... లుచ్చా పనులు చేయను

మొదటి పేజీ తరువాయి...

సంధించారు. అర్వింద్ కుమార్ చెప్పిన అంశాలను కేటీఆర్ వద్ద ప్రస్తావించారు. హెచ్ఎండీఏ కమిషనర్ దాన కిషోర్ విచారణలో చెప్పిన విషయాలపైనా ఆరా తీస్తూ, ప్రశ్నల వర్షం కురిపించారు.

**ఏసీబీ అధికారుల ప్రశ్నలు**

హైదరాబాద్‌లోనే ఫార్ములా ఈ-కారు రేస్ ఎందుకు నిర్వహించాలనుకున్నారు. అసలు హైదరాబాద్‌లో ఫార్ములా రేస్ ప్రతిపాదన ఎవరిది దాన్ని ఎవరు ఆమోదించారు. లాంటి ప్రశ్నలు అడిగారు. రేస్ నిర్వహణ ద్వారా ప్రభుత్వానికి ఏమైనా ప్రయోజనం లభించిందా ఇది నిబంధనలకు విరుద్ధమని మీకు తెలియదా అని అడిగినట్టు సమాచారం. ఆర్బీఐ పర్మిషన్ ఎందుకు తీసుకోలేదు, కేబినెట్ ఆమోదం లేకుండానే నిధులు ఎలా మళ్లిస్తారని కేటీఆర్‌ని అడిగినట్టు తెలిసింది. ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటానని స్పష్టం చేస్తూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

**సచ్చినా లుచ్చా పనులు చెయ్యను**

తెలంగాణ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అవినీతి నిరోధక విభాగం ఏసీబీ విచారణ కోసం బయలుదేరే సమయంలో తన ఇంటికొచ్చిన పార్టీ నేతలతో సమావేశయ్యారు. ఈ సందర్భంగా తనపై వచ్చిన ఆరోపణలపై కేటీఆర్ మీడియా సమక్షంలో ఘాటుగా స్పందించారు. కేసీఆర్ సైనికుడిగా, తెలంగాణ ప్రతిష్ఠ పెంచడానికి తన కృషి ఏమాత్రం తక్కువ కాదన్నారు. 'నీలా లుచ్చా పనులు, తుచ్చ పనులు చేయను. నేను క్విడ్ ప్రోకో చేయలేదు. మీలా అడ్డంగా దొరికిపోయిన దొంగను కాను. తెలంగాణ కోసం అవసరమైతే చావడానికి సిద్ధం. నాపై ఎన్ని కేసులు పెట్టినా నేను భయపడను. తెలంగాణ ప్రజలు మా పక్షాన ఉంటారని నాకు నమ్మకం ఉంది. హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపేందుకు ఫార్ములా ఈ-కార్ రేసుల లాంటి కార్యక్రమాలు చేపట్టాం. నేను ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాననే నాపై కేసులు పెట్టి, రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేయాలనుకుంటున్నారు' అని కేటీఆర్ తెలిపారు.

**అవినీతే లేనప్పుడు ఎం ప్రశ్నలు అడుగుతారు**

ఫార్ములా ఈ-కారు రేస్ కేసు విచారణలో అడిగేందుకు ప్రశ్నలు లేక అధికారులు ఇబ్బంది పడ్డారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేస్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, అందుకే అధికారుల దగ్గర ప్రశ్నలు లేవన్నారు. గురువారం ఏసీబీ విచారణ ముగిసిన అనంతరం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అడిగిన ప్రశ్నలనే ఏసీబీ అధికారులు అడిగారని తెలిపారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి కేంద్రంగా మార్చాలన్న ఉద్దేశంతో ఈ-కారు రేస్ చేపట్టామన్నారు. ఇదే విషయాన్ని ఏసీబీ అధికారులు తెలిపానన్నారు. అవినీతి లేని కేసులో అవినీతి గురించి అడిగే ప్రశ్న ఎక్కడిదని ప్రశ్నించారు. 'ఆ ఫైల్, ఈ ఫైల్ ఎక్కడ పోయాయని అని అడిగారు. తాను పదేండ్లు అవినీతి రహిత మంత్రిగా తన బాధ్యతలు నిర్వహించి నిర్ణయం తీసుకున్నా' అని అధికారులకు స్పష్టంగా చెప్పినట్లు తెలిపారు. న్యాయస్థానాలు, కోర్టులపై తనకు నమ్మకం ఉందని, తప్పకుండా సహకరిస్తానని కేటీఆర్ చెప్పారు.

### సుప్రీంలో కేటీఆర్
## క్వాష్ పిటిషన్
**ఈనెల 15న విచారిస్తామన్న చీఫ్ జస్టిస్ ఖన్నా**

**న్యూఢిల్లీ జనవరి 9(నిఘా న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించలేదు. ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను శుక్రవారం విచారణకు తీసుకునేందుకు చీఫ్ జస్టిస్ నిరాకరించారు. ఈనెల 15న సుప్రీంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగనుంది. 15వ తేదీన విచారణకు లిస్ట్ చేసినందున అదే రోజు విచారిస్తామని సీజే స్పష్టం చేశారు. అప్పటి దాకా కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు... కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన విషయం తెలిసిందే. అలాగే మధ్యంతర ఉత్తర్వులను కూడా హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో కేటీఆర్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణకు తీసుకోవాలని కేటీఆర్ తరపు న్యాయవాదులు కోరినప్పటికీ సుప్రీం కోర్టు సీజేఐ నిరాకరించారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన వెంటనే సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే దాన్ని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదంటూ 15 విచారణ జరుపుతామంటూ ఆరోజు లిస్ట్ చేశారు. అయితే ఈరోజు కేటీఆర్ తరపు న్యాయవాదులు సీజేఐ ధర్మాసనం ముందు హాజరై, ఇది సున్నితమైన అంశమని, కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉన్నందున్న అత్యవసరంగా విచారణ జరపాలని కేటీఆర్ న్యాయవాదు కోరారు. అయితే ఇది అంత అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతూ ఈనెల 15న విచారణకు లిస్ట్ చేసినందున ఇక ఆరోజే విచారస్తామని సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

# అమల్లోకి వచ్చిన భూ భారతి

మొదటి పేజీ తరువాయి...

ఈ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. డిసెంబర్ 20వ తేదీన భూభారతి బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం డిసెంబర్ 30వ తేదీన గవర్నర్ కార్యాలయానికి భూభారతి బిల్లు చేరింది. గురువారం భూ భారతి చట్టానికి ఆమోదం తెలుపుతూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో త్వరలోనే భూ భారతి మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. మార్గదర్శకాలపై సర్కార్ కసరత్తు చేస్తోంది. ఆర్వోఆర్ - 2020 వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. కొందరికి సేవ చేయడానికి మాత్రమే పరిమితమైన రెవెన్యూ సేవలను అందరికీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేసి భూ భారతి పోర్టల్‌ను ఏర్పాటు చేసింది.
ఆర్వోఆర్-2020ను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తూ, ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం అమల్లోకి రానుంది. గత ఏడాది డిసెంబర్ 18న భూ భారతి చట్టం బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా అదే నెల 20, 21 తేదీల్లో శాసనసభ, మండలి ఆమోదం తెలిపింది. ఆపై గర్నవర్‌కు ఈ బిల్లును పంపగా, గురువారం భూ భారతికి ఆమోదం తెలిపారు గవర్నర్. భూ భారతితో రైతులకు ప్రయోజనం చూకూరుతుందని ఇది వరకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు విస్తరించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. గ్రామాలలో రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని, ఇప్పటికే కసరత్తు కొలిక్కి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనల కు అనుగుణంగా రెవెన్యూ విభాగం పనిచేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తోందని, రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. జీహెచ్ఎంసీలో 88 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి అయ్యిందని వివరించారు.

### టీటీడీ ఈవో నిర్లక్ష్యంతో....
# మేము తిట్లు తింటున్నాము

మొదటి పేజీ తరువాయి...



తిట్లు తింటున్నాం. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలనే ప్రణాళిక లేదు. వ్యక్తులు చేసిన తప్పులు రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్నాయి. భవిష్యత్తులో దుర్ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆ క్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావుతోపాటు జేఈవో వెంకయ్య చౌదరిపై మండిపడ్డారు. బాధ్యతలు నిర్వర్తించడంలో టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వెంకయ్య చౌదరి విఫల మయ్యారన్నారు. ఈ ఘటనను బాధ్యతగా తీసుకోవాలని వారిద్దరికి ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సూచించారు. అధికారులు చేసిన తప్పిదానికి ప్రభుత్వం నిందలు మోస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీలో ప్రక్షాళన జరగాల్సి ఉందన్నారు. ఈ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి ఇళ్లకు వెళ్లి, క్షమాపణ చెప్పాలని టీటీడీ పాలకమండలిలోని సభ్యులకు పవన్ కల్యాణ్ సూచించారు. తిరుపతిలో తప్పు జరిగింది క్షమించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరగాలన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సామాన్యుల దర్శనాలపై దృష్టి పెట్టాలని టీటీడీకి సూచించారు. రద్దీని అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. ఈ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అంతకు ముందు తిరుపతిలోని బైరాగి పట్టెడ పద్మావతి పార్కులో తొక్కిసలాట జరిగిన ప్రదేశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై పవన్ కల్యాణ్ మండిపడ్డారు. భక్తులను ఒకే సారి ఎందుకు వదిలారంటూ వారిని ప్రశ్నించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్షమాపణలు చెబుతున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తప్పు జరిగింది. బాధ్యత తీసుకుంటాం. క్షతగాత్రులు, రాష్ట్ర ప్రజలు, వేంకటేశ్వరస్వామి భక్తులు, హైందవ ధర్మాన్ని నమ్మిన ప్రతి ఒక్కరినీ క్షమించమని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోంది. ఈ ఘటన జరగకుండా ఉండాల్సింది. క్రౌడ్ మేనేజ్‌మెంట్ సరిగా జరగలేదని భక్తులు చెబుతున్నారు. తితిదే సిబ్బంది, పోలీసులు ఉండి కూడా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వీఐపీలపై కాదు. సామాన్యుల పైనా తితిదే దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబాల వద్దకు తితిదే సభ్యులు వెళ్లి క్షమాపణలు చెప్పాలన్నారు. 'పోలీసుల్లో కొందరు కావాలని చేశారా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఈ అనుమానాలన్నింటిపై విచారణ జరగాల్సి ఉంది. ఈవో, అదనపు ఈవో, పాలకమండలికి మధ్య గ్యాప్ ఉందనే వాదన ఉంది. ఇంతమంది పోలీసు అధికారులున్నా తప్పు ఎందుకు జరిగింది. పోలీసుశాఖ నిర్లక్ష్యంపై సీఎం, డీజీపీ దృష్టికి మళ్లీ తీసుకెళ్తా. తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం 8-9 గంటలు ఎదురు చూసే పరిస్థితి మారాలి. సాధ్యమైతే ఒకట్రెండు గంటల్లో దర్శనం జరిగేలా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.

### తొక్కిసలాట ఘటనలో....
# అధికారుల సస్పెన్షన్

**తిరుపతి జనవరి 9(నిఘా న్యూస్):** తిరుపతి తొక్కిసలాట ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై తితిదే పరిపాలన భవనంలో సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. 'డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పనిచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రమణ కుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేశాం. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ను తక్షణమే బదిలీ చేస్తున్నాం. ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం అని ప్రకటించారు. తితిదే ద్వారా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. తిమ్మక్క, ఈశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి రూ.5 లక్షల చొప్పున సాయం చేస్తాం. గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తాం. బాధలో ఉన్నప్పటికీ స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం వారిలో ఉంది. 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తాం అని చంద్రబాబు తెలిపారు. ఇకపోతే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.. ఈ ఘటనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీర్ణించుకోలేకపోతున్నారు. ఘటనపై ఆరా తీసినప్పటి నుంచి సమీక్ష సమావేశం వరకు అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడుతూనే ఉన్నారు. టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం. ఇంకా కొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా బాధితులను పరామర్శించిన సీఎం చంద్రబాబు. ఆ తర్వాత టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. తొక్కిసలాట ఘటనతో పాటు రేపటి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై కూడా చర్చించినట్టు తెలుస్తుండగా, ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకన్న చౌదరీ, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు, ఎస్పీ సుబ్బారాయుడు, మంత్రులు సత్యకూమార్, నిమ్మల, ఇతర అధికారులు పాల్గొన్నారు. తొక్కిసలాట సహా జరిగిన ఘటనలపై 40 నిమిషాలకుపైగా చర్చించారు. అయితే, టీటీడీ ఉన్నాధికారుల తీరుపై చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షలో టీటీడీ ఈవోపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అజాగ్రత్తగా ఉండడం వల్లే ఇంతటి దుర్ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)ని ప్రక్షాళన చేస్తానన్న నమ్మకంతోనే ప్రజలు మాకు ఓట్లు వేశారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయబోమన్నారు.. అసలు దర్శన టోకన్ల కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఎందుకు పెట్టలేదని సమావేశంలో నిలదీశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే ఏ మాత్రం సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు.

## వైకుంఠ ఏకాదశిని 10 రోజులు ఎందుకు చేశారో?

మొదటి పేజీ తరువాయి...



వల్ల పవిత్రత దెబ్బతినే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే. అందరం కలిసి ఇక్కడ దేవునికి సేవ చేస్తున్నామనే భావన ఉండాలి. రాజకీయాలు చేయడానికి వీల్లేదు. రాజకీయాలకు అతీతంగా శ్రీ వేంకటేశ్వరునికి సేవచేస్తున్నామనే భావనతో అందరం ముందుకెళ్లాల్సిన అవసరముంది. భక్తుల మనోభావాల గురించి చెబుతూ కొండపై ఉన్నప్పుడు ఎంతసేపైనా క్యూలెన్లలో ఉంటాం. స్వామి వారిని తలచుకుంటూ ఆయన లీలలు గుర్తుచేసుకుంటూ దేవుని సేవలో సన్నిధిలో ఉంటాం, కానీ, తిరుపతిలో టోకెన్లు ఇవ్వడం మాకు సరైందని అనిపించడం లేదని భక్తులు చెప్పినట్లు ముఖ్యమంత్రి వివరించారు.

**జరిగిన సంఘటనపై విచారాన్ని వ్యక్తం చేస్తున్నా**

వైకుంఠ ఏకాదశి ద్వాదశి..రెండు రోజులు పవిత్రమైన రోజులు. అయితే పదిరోజులు చేశారని, ఎందుకు చేశారో తెలీదని, ఆగమ శాస్త్రాలు అనుమతిస్తాయో లేదో తెలీదని ముఖ్యమంత్రి అన్నారు. వేంకటేశ్వర స్వామి వెలసినప్పటి నుంచి ఏ సంప్రదాయాలు పాటిస్తున్నామో ఆ సంప్రదాయాలను ఉల్లంఘించడం కరెక్ట్ కాదనేది నా అభిప్రాయమని తెలిపారు. జరగరాని సంఘటన జరిగినదానికి విచారణను, బాధను, ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని దేవాలయాలనూ స్ట్రీమ్ లైన్ చేసి ఎక్కడా అపచారమనేది జరక్కుండా అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రసాదాల దగ్గరి నుంచి అన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేస్తున్న సందర్భంలో ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా దర్శన ఏర్పాట్లు చేయాలని చాలా స్పష్టంగా చెబుతున్నట్లు తెలిపారు.

**ఘటనపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ:**

ఘటనలో ఆరుమంది మరణించారని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు తక్షణమే ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని.. వారి కుటుంబ సభ్యులకు కాంట్రాక్టు ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని వీరికి రూ. 5 లక్షలు చొప్పున సాయమందిస్తామని, 33 మందికి గాయాలయ్యాయని వారికి రూ. 2 లక్షలు చొప్పున సాయమందిస్తామని ప్రకటించారు. బాధలో ఉన్నప్పటికీ స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం వారిలో ఉందని. దాన్ని నెరవేర్చేందుకు 35 మందికీ శుక్రవారం ప్రత్యేకంగా వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తామని తెలిపారు. వారికి అవసరమైన సహాయసహాకారాలు అందిస్తామన్నారు, డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పనిచేశారని, గోశాల డైరెక్టర్ హరనాథ్ రెడ్డి కూడా జవాబుదారీ తనంతో పనిచేయలేదని వెల్లడైందని, వీరిని సస్పెండ్ చేస్తున్నామని ప్రకటించారు. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ను తక్షణమే బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఘటనపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ వేస్తున్నామని, వాస్తవాలను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి రిపోర్టు ఇస్తారన్నారు. మేనేజ్‌మెంట్, ఎగ్జిక్యూటివ్స్ ఇంకా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని తెలిపారు. బోర్డు సభ్యులతో సహా ప్రతిఒక్కరూ సేవకులమనే భావనతో దేవుని సేవ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ పాత్రికేయ సమావేశంలో మంత్రుల బృందం అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి అనిత, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి, జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు, టిటిడి ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, పలువురు ఎమ్మెల్యేలు, ఎం ఎల్సిలు, టీటీడీ బోర్డు సభ్యులు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



### ప్రవాసీ భారతీయ రైలును
## ప్రారంభించిన ప్రధాని

మొదటి పేజీ తరువాయి...

రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరింది. మూడు వారాల జర్నీ ఉంటుంది. దేశంలోని పలు సంప్రదాయ, మతపరమైన ప్రదేశాలను ఆ రైలు చుట్టివస్తుంది. ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్‌ను, ప్రత్యేక టూరిస్టు రైలును రూపొందించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం ఈ టూరిస్టు రైలు కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు. 45 ఏండ్ల నుంచి 65 ఏండ్ల మధ్య ఉన్నవారు ఈ రైలులో ప్రయాణం చేయవచ్చు. తమ చారిత్రాత్మక మూలాలను టచ్ చేసే రీతిలో ఈ రైలు రూట్‌ను క్రియేట్ చేశారు. ఢిల్లీ నుంచి బయలుదేరిన రైలు ఆ తర్వాత అయోధ్య చేరుకుంటుంది. అక్కడ నుంచి పాట్నా, గయా, వారణాసి, మహాబలిపురం, రామేశ్వరం, మధురై, కొచ్చి, గోవా, ఎక్తా నగర్(కేవడియా), అజ్మీర్, పుష్కర్, ఆగ్రా పట్టణాలను ఆ రైలు చుట్టువస్తుంది. ఈ రైలులో 156 మంది ప్రయాణికుల ట్రావెల్ చేసే అవకాశం ఉంటుంది. విదేశాంగ శాఖ, భారతీయ రైల్వే, ఐఆర్సీటీసీ కలిసి ప్రవాసీ రైలును స్టార్ట్ చేశారు. వివిధ దేశాల్లోని భారతీయ ఎంబసీల నుంచి ఈ రైలు ప్రయాణికుల కోసం దరఖాస్తు చేశారు. తక్కువ ఆదాయం ఉన్న వారికి ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నారు. విదేశాంగ శాఖ ప్రకారం రైలు టూరుకు చెందిన అన్ని ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఆయా దేశాల నుంచి ఇండియాకు వచ్చే ప్రవాసీల రిటర్న్ విమాన ఖర్చులో 90 శాతం ప్రభుత్వమే పెట్టుకోనున్నది. ప్రయాణికులు కేవలం 10 శాతం ఛార్జీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైలులో టూర్ చేసే వారికి 4 స్టార్ హోటల్ అకామిడేషన్ ఇవ్వనున్నారు. రైలు ఆవిష్కరణ గురించి మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఓ ట్వీట్ చేశారు.

### జగన్ యూకే వెళ్లేందుకు
## కోర్టు అనుమతి
**ఈ నెల 11 నుంచి 30వ తేదీ వరకు**
**జగన్ యూకే పర్యటన**

**అమరావతి జనవరి 9 (నిఘా న్యూస్):** వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ విదేశాలకు వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతిచ్చింది. ఈనెల 11 నుంచి 30వ తేదీ వరకు జగన్ యూకేలో పర్యటించనున్నారు. అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న జగన్ విదేశాలకు వెళ్లడానికి సీబీఐ కోర్టు అనుమతి తీసుకోవాలని గతంలో నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది మే 16వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ మధ్యలో లండన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ దేశాల్లో ఆయన పర్యటించి వచ్చారు. అనంతరం తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 3 నుంచి 25వ తేదీ వరకు యూకే వెళ్లేందుకు సీబీఐ అనుమతి కోరగా కోర్టు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. తాజాగా మూడోసారి సీబీఐకి అనుమతిని కోరుతూ దరఖాస్తు చేసుకోగా కుటుంబసమేతంగా విదేశాలకు వెళ్లేందుకు న్యాయస్థానం అంగీకారం వ్యక్తం చేసింది.

### గోవింద నామాలు ప్రతి ధ్వనించాల్సిన చోట
## మృత్యుఘోష

**విజయవాడ జనవరి 9(నిఘా న్యూస్):** వైకుంఠ ద్వార దర్శనం కోసం వెళ్తే ఏకంగా వైకుంఠానికే పంపుతున్నారని అంటూ తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి మండిపడ్డారు. గోవింద నామాలు ప్రతిధ్వనించాల్సిన చోట ఘోరమైన మృత్యుఘోష వినిపించిందన్నారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కనీస ఏర్పాట్లు చేయక పోవడం పాలనా యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమంటూ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం, టీటీడీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయిన ఘటనపై నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ప్రకటించాలన్నారు. వారి ఇంట్లో అర్హులు ఉంటే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఏపీసీసీ పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబుని డిమాండ్ చేస్తున్నామ న్నారు. మొన్న లడ్డు కల్తీ నేడు తొక్కిసలాట కోట్లాది హిందువుల ఆరాధ్య దేవుడు, కలియుగ దైవం వెంకన్న క్షేత్రానికి మచ్చ తెచ్చి పెట్టాయన్నారు. తొక్కిసలాట ఘటనపై వెంటనే అత్యున్నత విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. కాగా వైకుంఠ ద్వార దర్శనం కోసం టీటీడీ ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్ల వద్ద గత అర్ధరాత్రి తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నారు. మరికొంతమంది గాయపడగా ప్రస్తుతం వారు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలను రాష్ట్ర మంత్రులు పరామర్శించారు. అలాగే ఆస్పత్రులకు వెళ్లి క్షతగ్రాలను పరామర్శించారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై సీరియస్ అయ్యారు. అయితే ఇవేవీ సంఘటనను మరిపించలేవన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.

# దైవ భక్తికి ప్రతీక ఇస్తేమా

### మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి




**శ్రీశైలం, జనవరి 9 (నిఘా న్యూస్):** శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరులో ఏర్పాటు చేసిన ఉమ్ మూమి తబ్లిక్ ఇజ్ తేమా (ఇస్తేమా)ను గురువారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సందర్శించి ఇస్తే మాకు వచ్చిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇస్తేమాకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,అన్ని వసతులు ఏర్పాటు చేసిన అధికారులకు బైరెడ్డి అభినందనలు తెలియజేశారు. మనిషికి ముఖ్యంగా మూడు భయాలు ఉండాలన్నారు. ఒకటి దేవుడు అంటే భయం ఉండాలి. రెండు తల్లిదండ్రులంటే భయం ఉండాలి. సమాజం అంటే భయం ఉండాలి ఈ మూడు భయాలు ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుందని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అన్ని మతాలవారు అభివృద్ధి చెందాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల్లో దైవభక్తిని పెంపొందించేందుకు ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు జరగడం అభినందనీయమన్నారు.

# ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

### 2,520 కిలోల ఎండు గంజాయి స్వాధీనం



**ఉప్పల్, జనవరి 9 (నిఘా న్యూస్):** ఎండు గంజాయి విక్రయిస్తున్నారని పక్కసమాచారంతో మల్లాపూర్ లో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 2.520 కిలోల ఎండు గంజాయిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉప్పల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బి.ఓంకార్ కథనం ప్రకారం బీహార్ కు చెందిన మల్లాపూర్ ఎస్వీ నగర్ లో నివసిస్తున్న మదన్ రామ్ ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 2.520 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. అతను బీహార్ రాష్ట్రం నుంచి గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొచ్చి ఎక్కువ డబ్బుకు అమ్ముతున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. మల్కాజ్గిరి డిపిఈవో పర్యవేక్షణలో నిందితునిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ పి.నరేష్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# వేగంగా వెళ్లే వాహనదారులకు ఆటోమెటిక్ చాలాన్




**తూప్రాన్, జనవరి 9 (నిఘా న్యూస్):** ఎన్ హెచ్ 44 ప్రమాదాల నివారణకై సేవ్ లైఫ్ ఫౌండేషన్ వాళ్లు ఎన్ హెచ్ 44 ని దత్తత తీసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా తూప్రాన్ లోని టీఎస్ఆర్ఎస్ జూనియర్ కాలేజీలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అతివేగంగా ప్రయాణించే వాహనాలపై ఆటోమేటిక్ చాలాన్ జనరేట్ అయ్యే విధంగా ఏఎన్పిఆర్ కెమెరాలు అమర్చారు. అంతేకాకుండా రోడ్ ఇంజనీరింగ్ డిఫెక్ట్ ఉన్న ప్రదేశాలను గుర్తించి దానిని సరి చేయడానికి ప్రణాళికల రూపొందిస్తూ ఎన్హెచ్ 44 పై ఉన్న పోలీసు సిబ్బందిలో ఫస్ట్ రెస్పాండెంట్స్ ప్రథమ చికిత్సతోపాటు క్షతగాత్రులను సురక్షితముగా తరలించే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సేవ్ లైఫ్ ఫౌండేషన్ వారి సహాయం ఎన్ హెచ్ 44 పై ప్రమాద నివారణకు ఎంతో దోహదపడుతుందని సేవ్ లైఫ్ ఫౌండేషన్ వారిని అభినందించారు. ఇందులో తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి, సిఐ రంగాకృష్ణ, ఎస్సై శివానందం, మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్ పాల్గొన్నారు.

# నరసింహస్వామి దేవాలయం వద్ద పారిశుద్ధ్య పనులు



**తూప్రాన్, జనవరి 9 (నిఘా న్యూస్):** తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పుర స్కరించుకుని తూప్రాన్ పట్టణంలోని పురాతనమైన శ్రీ కప్పుల నరసింహ స్వామి దేవస్థానం చుట్టూ సమీప పరిధిలో తూప్రాన్ మున్సిపల్ ఛైర్పర్సన్ మామిండ్ల జ్యోతి ముదిరాజ్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య పనులను మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య పనులను చేపట్టారు.

# ప్రజల ప్రాణాలను తీస్తున్న.. స్నేహ కోళ్ల ఫారంను మూసివేయాలి

- కోళ్ల ఫారం దుర్వాసన, వ్యర్థాలతో ఊపిరాడక ప్రజలు చస్తున్నారు
- బిసి పోలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్




**పెబ్బేరు, జనవరి 9 (నిఘా న్యూస్):** ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్నేహ చికెన్ ఫామ్ ను వెంటనే మూసివేయాలని బీసీ పొలిటికల్ జేఏసి రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు.గురువారం కంచిరావుపల్లి ప్రజల విజ్ఞప్తి మేరకు ఆ గ్రామ సమీపంలో ఉన్న స్నేహ చికెన్ ఫామ్ ను బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులతో కలిసి సందర్శించడానికి వెళ్లారు.స్నేహ కోళ్ల ఫారం సిబ్బంది బీసీ సంఘం నాయకులను లోనికి అనుమతి ఇవ్వకపోవడంతో అక్కడనే యుగంధర్ గౌడ్ విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ కోళ్ల ఫారం నుండి వస్తున్న దుర్వాసనను ప్రజలు భరించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వయస్సు పైపడ్డ వారికి ఊపిరి ఆడక వనపర్తి కెళ్ళి చికిత్సలు పొందినట్లు గ్రామస్తులు చెబుతున్నారని తెలిపారు.కోళ్ల ఫారంలో ఏం జరుగుతుందో చూడడానికి వెళ్దామంటే సిబ్బంది అనుమతి ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఓ పక్క చికెన్ దుర్వాసనతో ప్రజలకు రోగాలు వస్తుంటే మరోపక్క నాయకులు మద్దతు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ప్రజలకు క్యాన్సర్ వ్యాదులతో పాటు, భూములు పంటలు పండని స్థితికి చేరాయి అన్నారు.శ్వాస ఆడక కొందరు వృద్ధులు చనిపోయిన సంఘటనలు ఉన్నాయని,భూములు కొనుగోలు చేసినప్పుడు పక్క రైతులకు గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని మాయమాటలు చెప్పి నేడు పట్టించుకోవడం లేదన్నారు.గ్రామస్తులు చెప్పుతున్నది ఎంతవరకు నిజమా అని తెలుసుకోవడానికి లోపలికి వెళ్దామంటే సిబ్బంది అనుమతి ఇవ్వదన్నారు. దీన్ని బట్టి చూస్తే చికెన్ పేరుతో స్మగ్లింగ్ కు పాల్పడుతున్నట్లు ఉన్న ఆరోపణలు నిజమేనని అర్థమయితుందన్నారు.ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే మేఘారెడ్డి స్నేహ చికెన్ ఫామ్ మూసివేయుటకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులు చర్యలకు వెనకాడితే ప్రజలతో కలిసి కోళ్ల ఫారం మూసివేసే వరకు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్,నాయకులు వి.వేంకటన్న గౌడ్,అంజి సాగర్,గుర్రం రాఘవేందర్ గౌడ్,మహేందర్ నాయుడు, దేవర శివ, జితేందర్, గ్రామస్తులు ఎల్లారెడ్డి,విజయ్,గంధం సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పుంజుకుంటున్న తెలుగుదేశం

### మాజీ సర్పంచ్ వేముల సంజీవ గౌడ్



**ఘట్ కేసర్, జనవరి 9 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ రోజురోజుకు పుంజుకుంటుందని తెలుగుదేశం పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ అడక్ కమిటీ సభ్యుడు, ఘనపూర్ గ్రామ మాజీ సర్పంచ్ వేముల సంజీవ గౌడ్ తెలిపారు. గురువారం ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనపురం గ్రామంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో ఉన్నారని, వారందరూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల వరకు పార్టీలో చేరుతారని వారు అన్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, 100 రూపాయలు చెల్లించి తీసుకుంటున్నారని వారు వివరించారు. తెలుగుదేశం పార్టీపై ఉన్న అభిమానం, తెలంగాణ ప్రజల్లో ఇంకా మాసి పోలేదని ఆయన పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ఎవరైనా ప్రమాదవశాత్తులో మరణిస్తే, వారికి ఐదు లక్షల రూపాయలు అమలు చేస్తున్నటువంటి చంద్రబాబు నాయుడు విధానాలకు ఆకర్షితులై పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ పథకాన్ని తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ఉమ్మడి పొలిట్ బ్యూరో సభ్యుడు బక్క నరసింహులు, మల్కాజ్గిరి పార్లమెంటు అడక్ కమిటీ చైర్మన్ అశోక్ గౌడ్ ల ఆధ్వర్యంలో 150 పైచిలుకు సభ్యత్వాన్ని చేయించినట్లు సంజీవ గౌడ్ తెలిపారు. గ్రామాలలో స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారని వివరించారు.


# సంక్రాంతి సెలవులు తప్పని సరిగా అమలు చేయాలి

### రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



**శ్రీకాకుళం, జనవరి 9 (నిఘా న్యూస్):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన విధంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈ నెల 10 నుండి 19 వరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో సంక్రాంతి సెలవులు పక్కగా అమలు చేయాల్సిందేనని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గొండు సీతారాం అన్నారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ తమ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇప్పటికే వీటిపై జిల్లాల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట కొన్ని యాజమాన్యాలు ఇప్పటికే ఒత్తిడి తెస్తున్నట్లు ఆధారాలతో పాటు తమ కమిషన్ కు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. ఏ యాజమాన్యానికి ఎటువంటి మినహాయింపులు లేవని అన్నారు. ఇటువంటి పాఠశాలలపై ఆయా జిల్లా విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.తమ కమిషన్ ఈ సెలవుల అమలుపై డేగ కళ్ళతో పర్యవేక్షణ జరుతున్నట్టు చెప్పారు. ఆధారాలతో ఫిర్యాదులు అందితే చట్ట ప్రకార చర్యలకు వివిధ సిఫారసులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.ఫిర్యాదులు apscpcr2018@gmail.com మెయిల్ కి పంపితే ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులను అప్రమత్తం చేయనున్నట్టు సీతారాం తెలిపారు.

# వైభవంగా జై సంవిధాన్ కార్యక్రమం



**శ్రీకాళహస్తి, జనవరి 9 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ప్రారంభించారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ శాంతి దూతగా పిలవబడుతున్న మహాత్మా గాంధీని చులకన చేస్తున్నటువంటి కార్యక్రమాలను, భారత రాజ్యాంగాన్ని అబాసు పాలు చేసే విధంగా నడుచుకుంటున్న ఈ ప్రభుత్వం తీరును తీవ్రంగా ఖండించారు. బాల గురవం బాబు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెనువెంటనే అంబేద్కర్ క్షమాపణలు చెబుతూ రాజీనామా చేయాలని కోరారు. ఇటువంటి హేయమైన చర్యలు తీసుకున్నటువంటి ఈ ప్రభుత్వాన్ని ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ అనే కార్యక్రమాన్ని రూపొందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి రాబోవు రోజుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి నాంది పలకడం జరిగినది. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఇంచార్జ్ హరి, జిల్లా నాయకులు దాసరి రత్నం, అర్జున గురుమూర్తి, శబరి రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కళిందర్, శ్రీకాళహస్తి పట్టణ నాయకులు కరీముల్లా, ఆంటోనీ,చందు, ముబారక్, ఖాదర్ భాషా, అరుణ్, నాగరాజు, దేవా, చిరంజీవి, శంకర్, మాస్, శ్రీకాళహస్తి మండల నాయకులు నవీన్, శశి, లోకేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# డిజీ పురం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**శ్రీకాకుళం, జనవరి 9 (నిఘా న్యూస్):** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు విద్యార్థులు ఉపాధ్యాయులు ఉత్సాహంతో నిర్వహించారు. విద్యార్థులు,ఉపాధ్యాయులు తెలుగు సాంప్రదాయ దుస్తులు ధరించి,పాఠశాల అవరణంతా మామిడి తోరణాలతో,రంగు రంగుల రంగవల్లికలతో తీర్చిదిద్దారు. విద్యార్థులు వేసిన హరిదాసు, జంగమయ్య,సోదమ్మ వేషాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చెరకుగడలతో, క్రొత్తకుండలో పాలు పొంగించిడం, గొబ్బెమ్మలు,భోగి మంటలతో కోలాహలంగా పండుగ వ్యాతావరణాన్ని నెలకొల్పారు. విద్యార్థినిలు సంక్రాంతి, గొబ్బెమ్మ పాటలకు నృత్యప్రర్శనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల నుద్దేశించి ప్రధానోపాధ్యాయులు కె.చైతన్య మాట్లాడుతూ మన తెలుగు ఆచార సాంప్రదాయలను తెలియచెప్పే ఇటువంటి పండుగలను జరపటం ద్వారా విద్యార్థులకు పండగల ప్రాముఖ్యతను తెలియ చెప్పాలనే ఈ కార్యక్రమము నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మీకాంతం తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మి,పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు రవికుమార్ విజయలక్ష్మి, మార్కండేయులు, శ్రీనివాసరావు, దయాసాగర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతమే లక్ష్యం

### శంషాబాద్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**శంషాబాద్, జనవరి 9 (నిఘా న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వెల్లడించారు. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే ప్రక్రియలో భాగంగా అవసరమగు వైద్య సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. శంషాబాద్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ సుష్మ రెడ్డి పర్యటించి డి.సి.హెచ్.ఎస్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గలత మైలారంతో కలిసి నూతన దయాలసిస్ వైద్య విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గలత మైలారం మాట్లాడుతూ మూత్రపిండ అనారోగ్య బాధితులు డయాలసిస్ వైద్య విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కోడి పందాలు జల్లికట్టు నిర్వహిస్తే కేసులు తప్పవు

### గతంలో నిర్వహించిన వారిని ముందస్తుగా బైండోవర్ చేస్తాము

### హెచ్చరించిన పాకాల సిఐ సుదర్శన్ ప్రసాద్



**చంద్రగిరి, జనవరి 9 (నిఘా న్యూస్):** చంద్రగిరి నియోజకవర్గ పాకాల మండలం పాకాల పోలీస్ స్టేషన్ లో పాకాల సి.ఐ సుదర్శన్ ప్రసాద్ గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాకాల సిఐ సుదర్శన్ ప్రసాద్ మాట్లాడుతూ మండల ప్రజలకు ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా కోడి పందాలు జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన వారిని ముందస్తుగా బైండోవర్ చేసి కోర్టులో హాజరు పరుస్తామని పేర్కొన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.పేకాట ఆడుతున్నా ఆసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని చెప్పారు.సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని పేర్కొన్నారు.

# నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారిద్దాం

### ఉప్పల్ ఆర్టిఏ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు



**ఉప్పల్, జనవరి 9 (నిఘా న్యూస్):** ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం అనే నినాదంతో ఉప్పల్ రవాణాశాఖ ఆధ్వర్యంలో అధికారులు గురువారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహన దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని. ఈ విషయంలో నెల రోజుల్లో ప్రజల్లో అవగాహన పెంచాలని లక్ష్యంగా ముందుకు వెలుతున్నామని అన్నారు. రోడ్డు భద్రత అనేది అందరి బాధ్యత అని, అందరం పాటించినప్పుడే సమస్యలు రాకుండా, ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ ఉమ, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు పరశురాం, రాజ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నర్సింహ



**చిలుకానగర్, జనవరి 9 (నిఘా న్యూస్):** చిలుకానగర్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్ గా స్వర్ణలత రూపస్, వైస్ ఛైర్మన్ గా పల్లాటి ఇసాక్, అధ్యక్షుడిగా వీ.బీ.నర్సింహ్మా, ఉపాధ్యక్షులుగా మారపాక సాయిలు, గండికోట గణేష్, వీ.ఆర్. నవీన్, ప్రధాన కార్యదర్శిగా పౌల్ నర్సయ్య, సంయుక్త కార్యదర్శులుగా సంపత్ ఇవీ కుమార్, రాజు, సుందర్రాజు, కోశా ధికారిగా పల్లాటి దేవిడ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన విబి నర్సింహ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అసోసియేషన్ సభ్యులకు ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్రిష్టియన్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# రోడ్డు పనులను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



**రామంతాపూర్, జనవరి 9 (నిఘా న్యూస్):** రామంతపూర్ డివిజన్ గాంధీ నగర్ లో సీ సీ రోడ్డు పనులను గురువారం రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫిక్, మున్సిపల్ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీక్ మాట్లాడుతూ రామంతపూర్ డివిజన్ లో ఉన్న అన్ని కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి ల దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు విడుదల అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మొగిలి లింగం, ఉపాధ్యక్షులు రమేష్, గాంధీ నగర్ ప్రధాన కార్యదర్శి లగుసాని శ్రీనివాస్ గౌడ్, నరసింహ, యూసుఫ్ భాయ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నోజిగూడలో నేడు ముగ్గుల పోటీలు

### మహిళలందరూ పాల్గొనాలి: మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి

**ఘట్ కేసర్, జనవరి 9 (నిఘా న్యూస్):** సంక్రాంతి పండుగ సందర్భంగా నేటి శుక్రవారం అన్నోజిగూడ యాదాద్రి పార్క్ తెలంగాణ క్రీడా ప్రాంగణం వద్ద ముత్యాల ముగ్గుల పోటీలను పోచారం మున్సిపాలిటీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ పాల్గొని ఈ ముగ్గుల పోటీలను పరిశీలిస్తారు. అనంతరం మహిళా కౌన్సిలర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవరిస్తారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులను ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. కావున అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఈ ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని కోరారు. పోటీలో పాల్గొనే వారు ముగ్గులకు కావలసిన రంగులు వారే తెచ్చుకోవాలని సూచించారు. ఈ పోటీలలో పాల్గొనే ప్రతి మహిళ ఉదయము 10 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలో మ్యాథమెటిక్స్ డే



**శేరిలింగంపల్లి, జనవరి 9 (నిఘా న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎంతోమంది ఉన్నత పదవుల్లో ఉన్నారని,విద్యార్థులు మంచిగా చదువుకోని ఉన్నత శిఖరాలను అదరోహించాలని చందానగర్ డివిజన్ కార్పోరేటర్ మంజుల రెడ్డి అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట ఉర్దూ మీడియం పాఠశాలలో మ్యాథమెటిక్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చందానగర్ డివిజన్ కార్పోరేటర్ మంజుల ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు. స్టాల్స్ లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చందానగర్ డివిజన్ కార్పోరేటర్ మంజుల రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇందులో సాంకేతిక అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.

# కొడంగల్ లో బోదకాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు

### కొడంగల్ సబ్ యూనిట్ అధికారి ఎస్.పకీరప్ప



**వికారాబాద్, జనవరి 9 (నిఘా న్యూస్):** బోదకాలు వ్యాధి లక్షణాలను ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా, లక్షణాలు కనిపించిన వెంటనే కొడంగల్ పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో తనను సంప్రదించాలని కొడంగల్ సబ్ యూనిట్ అధికారి ఎస్. పకీరప్ప వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ ఆర్.ఎం. ఓ డాక్టర్ సాకేత్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని భర్తి రోగులకు బుధవారం రాత్రి 10 గంటల నుండి రాత్రి ఒకటి గంట వరకు బోదకాలు వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు చేయడం జరిగిందని వివరించారు. బోదకాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు రాత్రి 9 గంటలు దాటిన తర్వాతనే చేయవలసి ఉంటుందని స్పష్టం చేశారు. బోదకాలు వ్యాధిని ప్రబలకుండా ప్రాథమిక దశలోనే అరికట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆసుపత్రిలో భర్తీ ఉన్న రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని వివరించారు.

# మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, జనవరి 9 (నిఘా న్యూస్):** పటాన్చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని మత్స్యకారుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందించడంతో పాటు, మత్స్యకారుల సొసైటీలో నూతన సభ్యత్వానికి కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్చెరు పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఇస్నాపూర్ మత్స్యకార సహకార సంఘం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని వివిధ చెరువుల పరిధిలోగల మత్స్యకార సహకార సంఘంలో నూతన సభ్యత్వం అందించడం గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ పరిధిలోని పెద్ద చెరువు చేప పిల్లల పెంపకానికి అనువుగా లేదని సంబంధిత కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు నివేదిక ఇవ్వడం మూలంగా, చేప పిల్లలు పంపిణీ చేయడం మత్స్యశాఖ జిల్లా అధికారి నరసింహారావు ఎమ్మెల్యే జిఎంఆర్ కి తెలిపారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్. చేపల పెంపకంపై పూర్తిగా ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు ఆర్థికంగా నష్టపోతారని, పెద్ద చెరువు కాలుష్యంపై సమగ్ర నివేదిక అందించాలని పిసిబి అధికారి గీతను ఆదేశించారు. పెద్ద చెరువుకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సభ్యత్వం అందించాలని అధికారులను ఆదేశించారు. పిసిబి నివేదిక అనంతరం పెద్ద చెరువు పరిధిలోని పరిశ్రమల ద్వారా మత్స్యకారులందరికీ ప్రతి ఏటా నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రామచంద్రాపురం రాయసముద్రం చెరువు పరిధిలోని మత్స్యకార సహకార సంఘం సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డి ఈ రామ స్వామి, ఇస్నాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాఘవేందర్, వైస్ ప్రెసిడెంట్ గోపాల్, సలహాదారులు పెంటయ్య, నర్సింలు, రవీందర్, రామచంద్రాపురం ముదిరాజ్ సంఘం సభ్యులు శ్రీశైలం, రాములు, వెంకట్, గాంధీ శ్రీను, పెద్ద రాజు, టెంట్ హౌస్ శ్రీను, ఉమ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బీసీ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శీలం స్వామి

### నియామక పత్రం అందజేసిన ప్రధాన కార్యదర్శి గడ్డం నరసింహ



**ముస్తాబాద్, జనవరి 9 (నిఘా న్యూస్):** హైదరాబాద్ లోని విద్యానగర్ బిసి కార్యాలయంలో జాతీయ బీసీ యూత్ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన శీలం స్వామిని బీసీ యూత్ సంఘం జాతీయ అధ్యక్షుడు గడ్డం నర్సింహా నియమిస్తూ నియామక పత్రం స్వామికి అందజేశారు.గత 14 సంవత్సరాల నుండి ఉద్యమ పోరాటంలో పాల్గొంటూ బీసీల అభివృద్ధే లక్ష్యంగా వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూనే సంఘంలో చురుకుగా పాల్గొని క్రింది స్థాయి నుండి అవకాశాలు పొందుతూ గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తపరిచారు. నాపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షుడు గడ్డం నర్సింహకు అలాగే సంఘం జాతీయ నాయకత్వానికి, రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులను మార్గదర్శకంగా తీసుకొని వారి ఆశయసాధనే లక్ష్యంగా పని చేస్తానని, బీసీ యువత, నిరుద్యోగ, కార్మిక, కర్షకుల పక్షాన నిలబడి, హక్కుల సాధనే ధ్యేయంగా పని చేస్తూ బీసీ సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకపోతూ హక్కులు సాధించే దిశగా బాధ్యతలు నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా స్వామి తెలియజేశారు.

# జాతీయ స్థాయి పోటీలకు రామప్ప విద్యార్థుల ఎంపిక



**వరంగల్, జనవరి 9 (నిఘా న్యూస్):** ఈ నెల మెదక్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొన్న సోనాలి, హన్సిక, అమృతవర్షిణి, సాయి దీక్షిత లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని శ్లేష సౌత్ జోన్ సీనియర్ నేషనల్స్ చాంపియన్షిప్ విభాగంలో ఎంపిక కావడం జరిగిందని, ఈ నెల 11,12,13 వ తేదిల్లో పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని రామప్ప కళాశాల డైరెక్టర్ ఐలి కరుణాకర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని కి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామప్ప జూనియర్ కళాశాల కేవలం విద్యకే ప్రాధానత్య ఇవ్వడమే కాదు,విద్యార్థుల ఇష్టాలను తెలుసుకుంటూ, వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహించడంలో ముందుగా ఉంటుంది అన్నారు. విద్యార్థిని ఎంపికకు కృషి చేసిన ఫిజికల్ కోచ్ కమల్, ఏవో సతీష్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు. అందులో భాగంగా రామప్ప జూనియర్ కళాశాల శ్రేయోభిలాషి హనుమకొండ జిల్లా (సాఫ్ట్ బాల్ అసోసియేషన్) ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తాబేటి రాజేంద్రం రామప్ప కళాశాల యాజమాన్యానికి, శ్లేషకు ప్రత్యేకంగా అభినందనలు తెలియ చేసారు. కార్యక్రమంలో పూర్ణ చందర్,తిరుపతి, వినోద్ అధ్యాపక సిబ్బంది పాల్గొని శ్లేష ను అభినందించారు.

# ఏకాగ్రతతో ఏదైనా సాధించగలం

### గీతం విద్యార్థులకు ఉద్బోధించిన స్పిక్ మాకే వ్యవస్థాపకుడు డాక్టర్ కిరణ్ సేథ్



**పటాన్‌చెరు, జనవరి 9 (నిఘా న్యూస్):** ఏకాగ్రతతో సాధన చేస్తే ఎటువంటి లక్ష్యాలనైనా సులువుగా సాధించవచ్చునని, మనకు వారసత్వంగా సంక్రమించిన ఉచ్ఛ్వాస, నిశ్వాస పద్ధతులను రోజువారీ, అంతరాయం లేకుండా ఆచరించాలని స్పిక్ మాకే వ్యవస్థాపకుడు, ఐఐటీ ఢిల్లీ పూర్వ ఆచార్యుడు డాక్టర్ కిరణ్ సేథ్ గీతం విద్యార్థులకు ఉద్బోధించారు. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో 'వారసత్వ ప్రతిధ్వనులు' పై గురువారం జ్ఞానోదయ ప్రసంగం చేశారు. ఆధునిక అభ్యాస, పరిశోధనా పద్ధతులను ఏకీకృతం చేస్తూ పూర్వీకులు వారసత్వంగా ఇచ్చిన జ్ఞాన సంపదను అర్థం చేసుకోవడం, విలువైనదిగా భావించడం, ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పాశ్చాత్య పరిశోధనా పద్ధతుల పట్ల సమతుల్య దృక్పథం ప్రాముఖ్యతను వివరిస్తూ, మన దేశం ప్రపంచానికి అందించే లోతైన వారసత్వాన్ని కూడా గుర్తిస్తూనే, మనం పశ్చిమ దేశాలలోని ఉత్తమైన వాటిని నేర్చుకోవాలని డాక్టర్ కిరణ్ సేథ్ హితవు పలికారు. ఒత్తిడి, ఆందోళన పెరుగుతున్న ఈ ప్రపంచంలో, డాక్టర్ సేథ్ ఏకాగ్రత, బుద్ధిని పెంపొందించడానికి ఆచరణాత్మక శ్వాస వ్యాయామాలను (ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు) సాధన చేయించారు. ఏకాగ్రత సాధనను రోజువారీ ఆచరించే సరళమైన. ప్రభావవంతమైన పద్ధతి అని, నాసికపై దృష్టిని కేంద్రీకరించి యాభై సార్లు గాలిని నెమ్మదిగా పీల్చి, కొద్ది విరామం తరువాత వదలాలని, అలాగే వాయు నాళం ద్వారా నాభి వరకు శ్వాసను పీల్చి, కొద్దిసేపు ఆపి నెమ్మదిగా వదలాలని, చివరగా ఏకగ్రతను రెండు కనుబొమల ఉంచి యాభై సార్లు శ్వాస నెమ్మదిగా, పూర్తి చేతనతో తీసుకుని వదలాలని సూచించారు. ఇలా క్రమం తప్పకుండా చేస్తే, ఏకాగ్రత, స్థిరత్వం పెరిగి అనుకున్నది ఏదైనా సాధించగలని డాక్టర్ కిరణ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ శ్వాస అభ్యాసాన్ని దేశంలోని ప్రతి విద్యార్థి వద్దకు ఓ ఉద్యమంలా తీసుకెళ్లాలని సూచించారు. స్పిక్ మాకే ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఐఐటీ హైదరాబాద్ లో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేయించుకోవాలని డాక్టర్ కిరణ్ సలహా ఇచ్చారు. తొలుత, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ వీ.ఆర్. శాస్త్రి తదితరులు డాక్టర్ కిరణ్ సేథ్ ను స్వాగతించి, సత్కరించారు.

# ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటలు పోటీలు



**పామర్రు, జనవరి 9 (నిఘా న్యూస్):** కూచిపూడి మొవ్వ మండలంలో అవురుపూడి, చినుముత్తివి గ్రామాలలో ఈనెల 14, 15 తేదీలలో సంక్రాంతి పండుగ, కనుమ సందర్భంగా ముగ్గుల పోటీ, పరుగు పందెం, స్లో సైక్లింగ్, కుర్చీలాట, ఆట పాట తదితర ఆటల పోటీలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయి. 14వ తేదీ మధ్యాహ్నం నుండి చిన ముత్తెవి శివాలయం వద్ద, 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి అవురుపూడి పాల కేంద్రం వద్ద ఆటల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. చిన్నుత్తేవి, అవురుపూడి గ్రామాల నుంచి మహిళలు, యువతి యువకులు, చిన్నారులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా, డివైఎఫ్ఐ యువజన సంఘం, కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు, ఏ పి కౌలు రైతు సంఘం తదితర ప్రజా సంఘాలు చిన ముత్తేవి, అవురుపూడి గ్రామ కమిటీల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అవురుపూడి గ్రామంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి శీలం నారాయణరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మొవ్వమండల అధ్యక్షులు ఏనుగ శ్రీనివాసరావు (కొండా), బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గ్రామ రెవెన్యూ కార్మికులు గోపి, పాండురంగారావు, మద్దిరామయ్య నాగులపాటి గోపి, గట్టా సాయికృష్ణ, బాబి గ్రామ కౌలు రైతులు ఏనుగు శ్రీనివాసరావు, వంగూరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులు

### శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, జనవరి 9 (నిఘా న్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతుల కల్పనే ధ్యేయమని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా కాలనీ లో రూ.43 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డివిజన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. సమస్యలను ఒక్కొకటిగా అధిగమిస్తూ శాశ్వత పరిష్కారం చూపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధి నాయకులు మహిళ నాయకులు మహిళ కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం



**శ్రీకాళహస్తి, జనవరి 9 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోట ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో శ్రీకాళహస్తి పట్టణం నందు ప్రతి గురువారం మధ్యాహ్నం బస్టాండ్ సెంటర్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం 26 వ వారం బస్టాండ్ సెంటర్లో అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇంచార్జ్ పేట చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు తేజ, పట్టణ ప్రధాన కార్యదర్శి పేట చిరంజీవి వెంకటరమణ యాదవ్, లక్ష్మణ్, ప్రదీప్ కుమార్, హేమంత్ కుమార్, సురేష్, ముని చంద్ర, సాయి, నవీన్, వీర మహిళలు శారద గాయత్రి, బత్తేమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల మృతులకు... కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి



**గోకవరం, జనవరి 9 (నిఘా న్యూస్):** క్రమశిక్షణ లేని భక్తుల వలనే ఆరు మంది మృత్యువాత పడ్డారని, 35 మంది వరకు గాయపడ్డారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద అభిప్రాయపడ్డారు. తొక్కిస లాటలో మృతి చెందిన కుటుంబాలకు టీటీడీ కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతిలో దైవ దర్శనానికి టిక్కెట్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో క్రమశిక్షణ లేని భక్తుల ఆరాటం అత్యుత్సాహం ఆరు మంది మరణానికి పలుమంది గాయపడ్డానికి కారణం అని, ఈ దుర్ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి బాధ్యులపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాల కు ఆయన తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు.

# అంగన్వాడీ పిల్లలను కుర్చీలలో కూర్చోబెట్టాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట, జనవరి 9 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా కేంద్రంలో గల బీసీ కాలనీ అంగన్ వాడీ కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారుల విద్యా ప్రమాణాల నైపుణ్యాన్ని ఆమె పరిశీలించారు. కేంద్రంలో అంగన్వాడీ టీచర్ బోధిస్తున్న పూర్వ ప్రాథమిక విద్యను పర్యవేక్షించారు. కేంద్రంలో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం (పాలు, గుడ్లు, బాలామృతం) గురించి ఆరా తీశారు. పాలు, గుడ్లు నాణ్యతగా ఉంటున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. శ్యామ్ మ్యామ్ పిల్లల వివరాలను అడిగారు. కేంద్రంలో చిన్నారులకు అందుబాటులో ఉన్న బోధనా పరికరాలను చూశారు. పిల్లలను కింద కాకుండా కుర్చీలలో కూర్చోబెట్టాలని, ఎంత మంది చిన్నారులకు ఎన్ని కుర్చీలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.



**ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం ఉప్పల్ ఎమ్మార్వో వాణి రెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్పొరేటర్లు శాంతి, గీత, నాచారం చిలుకా నగర్ డివిజన్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.**

*–ఉప్పల్, జనవరి 9 (నిఘా న్యూస్):*



జగ్గంపేట మండలం ఇర్రిపాక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వగృహంలో తంటికొండ గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎంపీయుపి స్కూల్ చైర్మన్ నాగం వెంకటపతి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండలం మాజీ ఎంపీపీ కంచుమర్తి రాఘవ, తంటికొండ మాజీ ఎంపీటీసీ గెడ్డం బాబు, చింతల నాగు, గంటిపూడి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

*–జగ్గంపేట, జనవరి 9 (నిఘా న్యూస్):*

# తొక్కిసలాటలో అమాయకుల మృతి దురదృష్టకరం

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**తిరుపతి, జనవరి 9 (నిఘా న్యూస్):** వైకుంఠ ఏకాదశి దర్శనానికి టిక్కెట్లు ఇచ్చే కౌంటర్ల వద్ద సంభవించిన తొక్కిసలాటలో ఆరు మంది మృతి చెందటం దురదృష్టకరమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మృత దేహాలను అధికారుల సహాయంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గాయపడిన వారిని రుయా ఆసుపత్రిలో చేర్పించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను నాని కోరారు. వీలైనంత ఎక్కువ మందికి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనం కల్పించాలన్న ఉద్దశంతో పలు చోట్ల టికెట్లు ఇవ్వటాని 90 కి పైగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



అయితే కొందరు దూకుడుగా ప్రవర్తించటంతో ఇంతటి విచారకరమైన సంఘటన చోటు చేసుకుందని ఆవేదన వ్యక్తంచేశారు. కొందరు చేసిన పొరపాటుకు ఇంతటి ఘోరం జరిగిందన్నారు. సంఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విషయం తెలుసుకుని సహాయక చర్యల కోసం ముగ్గురు మంత్రులను పంపారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు సహాయక చర్యలలో పాల్గొంటున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబాలను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. వారికి వైద్యం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు వివరించారు.సంఘటన జరిగిన తీరును పరిశీలించినట్లు చెప్పారు. ఇది అత్యంత విచారకరమైన సంఘటనగా భావించి అందరూ సమన్వయంగా ఉండాలని కోరారు. మృతుల భౌతిక దేహాలకు ఎమ్మెల్యే పులివర్తి నాని దగ్గరుండి పోస్టుమార్టం చేయించి ఇండ్లకు పంపే ఏర్పాటు చేశారు.

## వలిగొండలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు




**వలిగొండ, జనవరి 9 (నిఘా న్యూస్):** వలిగొండ మండల కేంద్రంలోని స్కిడ్ స్వచ్ఛంద సంస్థ యాదాద్రి భువనగిరి జిల్లా వారు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు హెచ్ఐవి ఎయిడ్స్ పైన వలిగొండలోని ఎస్ ఎం ఎల్ ఎన్ ఎస్ కార్ యూనియన్ డ్రైవర్లకు హెచ్ఐవి స్కానింగ్ పరీక్షలు చేయడంతో పాటుగా హెచ్ఐవి ఎయిడ్స్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కిడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది. ఓ ఆర్ డబ్ల్యు చామంతి, గొర్ర సంతోష యూనియన్ అధ్యక్షులు కొక్కల సత్తయ్య, గుండు వెంకటేష్, గంగారం రమేష్,కూర వెంకటేష్,మైలారం నర్సింహ, ఎండి ముబిన్, తోట రాములు, కనకబోయిన రఘుపతి, మైసోళ్ల వెంకటేశం,జెట్ట సత్యం, బూడిద బాబు,పబ్బు నాని,కొమ్మగాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

**మేడ్చల్, జనవరి 9 (నిఘా న్యూస్):** గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నరసింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన కార్యదర్శి త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండగ అనగానే మనకు గుర్తుకు వచ్చేది పల్లె వాతావరణం, పాడి పంటలు, భోగి మంటలు, రంగురంగుల ముగ్గులు, పచ్చని పైరు గల పొలాలు అన్ని ఎంతో అందంగా ఆహ్లాదకరంగా కనువిందుగా ఉంటాయని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డా.ఆర్. లోకనాథం మాట్లాడుతూ ఈ పండుగ సమయంలో రైతులు పండించిన పంట చేతికి వచ్చి వారికి లాభం చేకూర్తుంది కాబట్టి దీని రైతుల పండుగ అని కూడా అంటారని అందుకు తగ్గట్టు మనం మన పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కళాశాల ప్రాంగణమంతా ముగ్గులు, గాలిపటాలు, భోగి మంటలతో కొలహలంగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నరసింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్



మోహన్, కళాశాల ప్రిన్సిపల్ లోకనాథం, ఎస్ఎస్సి కన్వీనర్ పురుషోత్తం ప్రసాద్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి జమాల్ ఖాన్ సాయం



**చింతూరు, జనవరి 9 (నిఘా న్యూస్):** చింతూరు మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన సున్నం యర్రయ్య అనారోగ్య కారణంగా ఇటీవల మృతి చెందారు. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానికుల సలహా మేరకు గురువారం మృతుడి కుటుంబ సభ్యులకు జే.కె.సి, ట్రస్ట్ చైర్మన్ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్ నగదు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షేక్ రసూల్, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తీరును నిరసించిన బిఆర్ఎస్

**భువనగిరి, జనవరి 9 (నిఘా న్యూస్):** తుర్కపల్లి లో కెసిఆర్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కెనాల్ నీటిని విడుదల చేస్తూ మేమే పనులు పూర్తి చేశామనడం సిగ్గుచేటని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడిన మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా.అమరేందర్ గౌడ్ జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు కొలుపుల అమరేందర్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు పట్టణ పార్టీ అధ్యక్షులు ఏ.వి.కిరణ్ మాజీ జెడ్పిటిసి సుబ్బారు బీరు మల్లయ్య గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు దండగ ప్రాజెక్టు అని అబద్ధపు మాయ మాటలు చెప్పి గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు అదే కాళేశ్వరం ప్రాజెక్ట్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయడం హాస్యాస్పదం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు అబ్బగాని వెంకట్ గౌడ్ సందెల సుధాకర్ రచ్చ శ్రీనివాస్ రెడ్డి కస్తూరి పాండు కంచి మల్లయ్య సింగిరెడ్డి నర్సిరెడ్డి ఇట్టబోయిన గోపాల్ రాకల శ్రీనివాస్ తాడెం



రాజశేఖర్ యండి ఇక్బల్ చౌదరి యండి ఖాజం పెంట నితీష్ బాతుక అశోక్ నాగులు నాగారం సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు.. దుపట్లు పంపిణీ చేసిన కలెక్టర్



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 9 (నిఘా న్యూస్):** అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధి కోహెడ గ్రామంలోని ఎస్సి హాస్టల్ విద్యార్థులకు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ తహసిల్దార్ సుదర్శన్ రెడ్డితో కలిసి పుస్తకాలు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, మంచాల, మాడ్గుల తహసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించాలి

### జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ ఎం.బాలకృష్ణ





**చింతూరు, జనవరి 9 (నిఘా న్యూస్):** సంస్కృతి, సాంప్రదాయాలను, పరిరక్షించాల్సిన విద్యార్థులదేనని జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ ఎం.బాలకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి గురువారం సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వాతి, రమేష్, పెంటమ్మ, నాగరాజు, సుజాత,సుబ్బయ్య, రత్తయ్య, రాజు, భద్రయ్య, ప్రసాద్, శ్రీను, జయ, శ్రీరామ్,మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జిట్టా బాలకృష్ణారెడ్డి కాంస్య విగ్రహ పోస్టర్ ఆవిష్కరణ

**వలిగొండ, జనవరి 9 (నిఘా న్యూస్):** వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద ఈ నెల 12 న భువనగిరి పట్టణంలో జరిగే తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిట్టా బాలక్రిష్ణా రెడ్డి కాంస్య విగ్రహ ఆవిష్కరణకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ నాయకులు మహమ్మద్ రావుఫ్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేయడంలో ఆయన పాత్ర అనన్య సామాన్యం ప్రజా సంక్షేమం కోసం నిత్యం పరితపించే నాయకుడని ఉమ్మడి జిల్లాలో టిఆర్ఎస్ పార్టీకి అన్ని తానై వ్యవహరించిన జిట్టా స్వరాష్ట్ర కాంక్షలు రగిల్చి ప్రజల్లోకి పార్టీని విస్తృతంగా తీసుకెళ్లారని ఫ్లోరైడ్ సమస్యతో కాళ్లు చేతులు వంకర్లు తిరిగి జీవితాన్ని దుర్భరంగా గడుపుతున్న వారిని చూడలేక ఆయన సొంత ఖర్చుతో గ్రామాలలో నెలకొల్పిన ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లు నేటికీ మనుగడలో ఉన్నాయంటే అది ఆయన కృషేనన్నారు. కాలుష్య కంపెనీలపై కొట్లాడడం ఎయిమ్స్ లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని దీక్షలు చేపట్టారని అన్నారు. మూసి ప్రక్షాళన కోసం 200 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. పేదవారికి విద్యా వైద్యం ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం లాంటి అనేక మంచి కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. పార్టీలకు



అతీతంగా భువనగిరి నియోజకవర్గ ప్రజలు పాల్గొని వారికి ఘన నివాళులు అర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ బడుగు సత్యనారాయణ, చిలుగూరి సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, పబ్బు సురేందర్, ఎండి సమ్మద్, బొల్లు శ్రీను, నానాచర్ల రమేష్, కూర రవీందర్, సాయిని యాదగిరి, కొండూరు సత్తయ్య, బతిని రవి, శీలం స్వామి, మైసొల్ల యాదగిరి, కంకల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## తాండూరు బిజెపి అధ్యక్షులుగా నాగారం మల్లేశం

**తాండూరు, జనవరి 9 (నిఘా న్యూస్):** తాండూరు పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షులు నాగారం మల్లేషం ను మరోసారి తాండూరు పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షులుగా బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు నియమించడం జరిగిందని బిజెపి పార్టీ తాండూరు పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకు తిరిగి బిజెపి పార్టీ తాండూరు పట్టణ అధ్యక్షులుగా



బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర బిజెపి నాయకుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని వెల్లడించారు. బిజెపి రాష్ట్ర పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. తాండూరు నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు నాగారం మల్లేశంకు శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు




**బాలాపూర్, జనవరి 9 (నిఘా న్యూస్):** తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కొత్తపేటలోని సత్య నగర్ కమాన్ వద్ద ముగ్గుల పోటీలను నిర్వహించారు. దాదాపు 70 మంది వరకు పాల్గొన్న ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ ,తృతీయ బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు కూడా అందజేసినట్లు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ తెలిపారు. కాలనీవాసులు యాదగిరి రెడ్డి, బెస్ట్ సేవా సొసైటీ అధ్యక్షులు బొక్క ఈశ్వరయ్య, సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కృష్ణారెడ్డి, కార్యదర్శి కోడుమూరు దయాకర్ బహుమతులను అందజేశారు.

## మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం




### మెగా రుణమేళాలో 10 కోట్ల చెక్కులు పంపిణీ

### డిఆర్డిఏ పిడి టిఎన్ శోభన్ బాబు

**రామచంద్రపురం, జనవరి 9 (నిఘా న్యూస్):** రాష్ట్రంలోని మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నదని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు టిఎన్ శోభన్ బాబు అన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఋణమేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సృష్టికర్త,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలను వంటింటికి పరిమితం చేయకుండా అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ సహకారంతో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో 70 మహిళా స్వయం సహాయక సంఘాలకు 10 కోట్ల రూపాయల ఋణాలను పంపిణీ చేస్తున్నామన్నారు.బ్యాంకు ఋణాలు తీసుకున్న ప్రతి డ్వాక్రా సభ్యురాలు క్రమం తప్పకుండా ఋణాలు చెల్లింపులు చేయాలని కోరారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధే కాకుండా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని అన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, ఉచిత ఆర్టీసీ బస్సు రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు తీసుకొస్తుందన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కిషోర్ పట్నాయక్ మాట్లాడుతూ మహిళలకు డ్వాక్రా ఋణాలతో పాటు, కుటుంబంలోని చదువుకుంటున్న పిల్లలకు విద్యా ఋణాలు, హౌసింగ్ లోన్లు మంజూరు చేస్తామని తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలు తీసుకున్న ఋణాలు సక్రంగా చెల్లిస్తున్నందున ఋణ పరిమితిని కూడా పెంచి 50 లక్షల రూపాయల వరకు ఋణాలు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ ఋణాలను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో ఇందిర మాట్లాడుతూ సమాజంలో మహిళలు మహారాణులుగా ఎదిగి తలెత్తుకుని తిరగాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరగాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేకూరి జనార్దన్ చౌదరి, రావిళ్ళ గిరినాయుడు, పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, బాదూరు కోటేశ్వర్ రెడ్డి, వెలుగు పథకం ఏరియా కోఆర్డినేటర్ వనజాక్షి, అరుణ మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, సంఘ మిత్రలు, డ్వాక్రా సంఘాల లీడర్లు మహిళలు పాల్గొన్నారు.

## హేమానగర్ లో ముగ్గుల పోటీలు



**బోడుప్పల్, జనవరి 9 (నిఘా న్యూస్):** న్యూ హేమా నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ వద్ద టైలరింగ్ టీచర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా పోటాపోటీగా ముగ్గులు వేశారు. సంస్కృతిని చాటి చెప్పేలా వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. న్యాయ నిర్ణేతగా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షురాలు, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నే రేవతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలందరికీ అభినందనలు తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు తగిన ప్రోత్సహించిన వరలక్ష్మికి అభినందనలు తెలిపారు. ఈ ముగ్గుల పోటీల్లో సుమారు 30 మంది మహిళలు పాల్గొన్నారు.

## అక్రమంగా నిర్మించిన షెడ్డు కూల్చివేత



**బాలాపూర్, జనవరి 9 (నిఘా న్యూస్):** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్ గుల్ పరిధిలోని సర్వే నంబర్ 180/ఏ లో 1100గజాల స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్డును కమీషనర్ పి సరస్వతి ఆదేశాల మేరకు టీ పీ ఎస్ లాలప్ప ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో అనుమతులు లేకుండా, అనుమతి తీసుకున్న ప్లాన్ కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ మున్సిపల్ అనుమతులు తీసుకొని ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

# మహిళ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

### ఐద్వా చింతూరు మండల కమిటీ

**చింతూరు, జనవరి 9 (నిఘా న్యూస్):** మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, అఘాయిత్యాలు, పెరిగిపోతున్నాయని చట్టాలు ఉన్నా అమలు శూన్యంగా ఉందని మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా మహిళా సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లం సుబ్బమ్మ, ముర్రం రంగమ్మ, డిమాండ్ చేశారు. గురువారం ఏడుగురాళ్లపల్లిలో ఐద్వా మహిళా సంఘం చింతూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి సంబరాలు సందర్భంగా వివిధ రకాల ఆటల పోటీలు, రంగోలి, మహిళా సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా విచ్చేసిన మహిళలకు రంగవల్లిలు, ముగ్గుల పోటీలను, తాడాట, కుర్చీ ఆట, బంతి ఆట, నిర్వహించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు ప్రథమ ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతులను అందించడం జరిగినది, అనంతరం జరిగిన మహిళా సదస్సులో మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లం సుబ్బమ్మ, ముర్రం రంగమ్మ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి. అనాదిగా మహిళలపై దాడులు అఘాయిత్యాలు అత్యాచారాలు మాత్రం ఆగడం లేదని 90 ఏళ్ల ముసలి నుండి ఆరు నెలల పసికందు వరకు నిత్యం ఏదో ఒక ప్రదేశంలో అగత్యానికి గురవుతూనే ఉన్నారని, ఘటన జరిగిన సందర్భంలో మాత్రమే అధికారంలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు, అధికారులు, నిందితులను కఠినంగా శిక్షిస్తాం నేరాలను తగ్గిస్తాం అని, రక్షణ చట్టాలను రూపొందిస్తున్నాం అని ప్రచారానికి మాత్రమే పరిమితం అవుతున్నాయని మహిళలపై జరిగే దారుణాల కారణమైన మద్యం, డ్రగ్స్, అశ్లీలతను




నియంత్రించాల్సి నటువంటి ప్రభుత్వ యంత్రాంగం, నామ మాత్రపు చర్యలతో సరిపెడుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. ఎన్నికల సందర్భంగా మాత్రమే మద్యాన్ని దశలవారీగా నియంత్రిస్తాం అని ప్రకటన చేస్తున్నారు. కానీ పట్టణాల నుండి గ్రామాలు మారుమూల ప్రాంతాల వరకు విచ్చలవిడిగా ఏరులై పారుతుందని నియంత్రణలో యంత్రాంగం విఫలం అయిందని మహిళలపై దారుణాలు నియంత్రణ కోసం దిశ, నిర్భయ, పోక్స్, చట్టాలు ఉన్న అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. ఈ చట్టాలు పటిష్టంగా అమలు చేసి నియంత్రించడం మహిళలకు ఉన్నటువంటి హక్కులను రాజకీయ హక్కులను, 33 శాతం రిజర్వేషన్ను పటిష్టంగా అమలు చేస్తే మహిళకు న్యాయం జరుగుతుందని, రానున్న రోజుల్లో మహిళలపై జరిగే దార్నాలపై మహిళలు ఐక్యంగా ముందుకు రావాలని ఈ సందర్భంగా అన్నారు, ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి కుటుంబంలోని 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు ప్రతి నెల 1500 రూపాయలు అందిస్తానని ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని పొదుపు మహిళలను లక్షఅధికారులుగా తీర్చిదిద్దే కార్యక్రమం రూపొందిస్తామని ప్రకటనలకు మాత్రమే పరిమితం అయిందని ఎన్నికల హామీని ప్రభుత్వం అమలులో జాప్యం తగదని ఉచిత గ్యాస్ పథకం కూడా కొంతమందికి మాత్రమే వర్తించిందని ప్రతి మహిళకు ఉచితంగా గ్యాస్ బండ పంపిణీ చెయ్యాలని డిపాజిట్ చేశాక అనేక కారణాలతో డబ్బులు తిరిగి రాక చాలామంది మహిళలు నష్టపోయారని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ జయలక్ష్మి, యు. నాగమణి, మాధవి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

### తహసీల్దార్ వై.వెంకటేష్




**తాండూరు, జనవరి 9 (నిఘా న్యూస్):** సమాజాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని తహసీల్దార్ వై.వెంకటేష్, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ వెల్లడించారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని టి.ఎస్.యు.టి.ఎఫ్.మండల ఉపాధ్యాయుల సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్ ను అధ్యక్షులు సుగంధి రవికుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, మండల కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో తహసీల్దార్ వై.వెంకటేష్, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బి.నాగరాజ్ చేతుల మీదుగా బషీరాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున్, గోపాల్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింలు, జమున, మండల ఉపాధ్యక్షులు జగదీష్, కోశాధికారి వెంకటయ్య, ప్రకాష్, శేషగిరి, మండల కార్యవర్గ సభ్యులు, బషీరాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన మేయర్



**బాలాపూర్, జనవరి 9 (నిఘా న్యూస్):** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని నాదర్ గుల్ లోని 27వ డివిజన్ వెంకటాద్రి కాలనిలో సీసీ రోడ్డు, 8వ డివిజన్ అంబేద్కర్ నగర్ లో బీటీ రోడ్డు నిర్మాణం పనులను మేయర్ చిగిరింత పారిజాత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, నాయకులు మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, నర్సింహా, యాతం మహేందర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా వనజ నియామకం



**కుత్బుల్లాపూర్, జనవరి 9 (నిఘా న్యూస్):** ట్రస్మా రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షురాలిగా వనజ ప్రమాణ స్వీకారం చేశారు. జగద్గిరిగుట్ట అశోక్ మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ స్థాయి నుండి కుత్బుల్లాపూర్ మండలం గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాల కరస్పాండెంట్ అసోసియేషన్ (క్యూఎంఆర్ఎస్ సి ఏ) ప్రధాన కార్యదర్శి గా, మండల అధ్యక్షురాలుగా, ట్రస్మా మేడ్చల్ జిల్లా జాయింట్ సెక్రటరీగా, జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఇలా ఒక మహిళ కరస్పాండెంట్ గా ఉంటూ అంచలంచెలుగా ఎదుగుతూ నేడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వనజ అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా పదవి అప్పగించినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పాఠశాలల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీతో కలిసి పనిచేస్తానని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ప్రమాణం చేసిన వనజకు పలువురు కరస్పాండెంట్లు అభినందనలు తెలిపారు.

## పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగింపు



**తూప్రాన్, జనవరి 9 (నిఘా న్యూస్):** తూప్రాన్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క, జీవరాశికి పెను ముప్పుగా మారిన నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు మామిళ్ళ కృష్ణ, కమిషనర్ గణేష్ రెడ్డి, కౌన్సిలర్ పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా, మత్స్యశాఖ నాయకులు మున్సిపల్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పైడిగూడెం నందు టసర్ సిల్క్ గోడౌన్ నిర్మాణం

### ఛత్తీస్గఢ్ టీంతో కలసి సందర్శించిన అపూర్వ భరత్

**కూనవరం, జనవరి 9 (నిఘా న్యూస్):** చింతూరు డివిజన్ నందు టాసర్ సిల్క్ పంట, వాటి ప్రొడక్ట్స్ ను అభివృద్ధి చేయడానికి, టాసర్ సిల్క్ ఒక బ్రాండ్ క్రియేట్ చేసి ప్రమోట్ చేయడానికి పైడిగూడెం గ్రామం నందు పర్మినెంట్ తసర్ సిల్క్ గోడౌన్ నిర్మించటం జరుగుతుంది. ఈ గోడౌన్ లో శిక్షణ కు సంబంధించిన యంత్రాలు పెట్టడానికి సంబంధించిన పనులను, బాత్ రూమ్స్ సదుపాయాలు శిక్షణ తీసుకునే వాళ్లకు ఈ గోడౌన్ లో కల్పించాలని అని సదరు ఈఈ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ శాఖ వారిని అదేశించడం జరిగినది. త్వరలో గోడౌన్ నిర్మాణం అయిన తర్వాత శిక్షణకు సంబంధించిన యంత్రాలు, పరికరాలు తెప్పించి దారం నుండి బట్ట తయారీ నేయటం జరుగుతోంది అని పేర్కొన్నారు. ఐటిడిఏ చింతూరు నుండి మంచి నాణ్యత కల్గిన టాసర్ సిల్క్ ప్రొడక్ట్స్ ను రాష్ట్రంలో ఐటిడిఏ లోగో బ్రాండ్ తో ఉత్పత్తి చేసి విధంగా ఛత్తీస్గఢ్ టీం తో శిక్షణ ఇవ్వటం



జరుగుతుందని వివరించారు. అలాగే వచ్చే సంవత్సరం నుండి తసార్ పంట ను ఈ నాలుగు మండలాల్లో విస్తరించడానికి సెరికల్చర్ శాఖ వారితో కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నారు అని పేర్కొన్నారు. తదుపరి ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారు పైడిగూడెం టాసర్ సిల్క్ తీసే రైతులతో మాట్లాడి పైడిగుడెం నందు పర్మనెంట్ తాసర్ సిల్క్ గోడౌన్ నిర్మిస్తున్నామని అలాగే మంచి నాణ్యతతో కూడిన దారం నుండి బట్ట తయారీ నేసే శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ అందరూ బాగా నేర్చుకొని వారి జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలి అని పేర్కొన్నారు. బట్ట నేసిన తర్వాత బట్ట ఎంబ్రాయిడరీ డిజైన్ వర్క్స్ సంబంధించిన శిక్షణ కార్యక్రమంను మొదలు పెట్టడం జరగుతుంది అన్నారు. డిజైన్ వర్క్స్ సంబంధించి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ విజయవాడ వారితో ఒప్పందం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొదట పైలట్ ప్రాజెక్ట్ కింద 40 మంది రైతులకు దారం నుండి బట్ట తయారీ తీసే శిక్షణ కార్యక్రమం అతి త్వరలో ఇవ్వటం జరుగుతుందని తదుపరి దశల వారీగా బ్యాచ్ సైజ్ కూడా పెంచి శిక్షణ ఇవ్వటం జరుగుతుందిని వివరించారు. ఈ కార్యక్రమంలో పూజ వర్మ, ఛత్తీస్గఢ్ టీం లీడర్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ విజయవాడ, అంబేద్కర్ యస్ డి సి,భూ సేకరణ, చింతూరు, హరికృష్ణ, అసిస్టెంట్ సేరి కల్చర్ అధికారి, చింతూరు, మురళీ ఈ ఈ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ కలసిన గంజి ఆర్ ఎజ్రా,బిషప్ బింకం బర్నబాస్, పాస్టర్ కె వి సాల్మన్
- క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, జనవరి 9 (నిఘా న్యూస్):** క్రైస్తవుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని డా.గంజి ఆర్ ఎజ్రా,బింకం బర్నబాస్, పాస్టర్ కె వి సాల్మన్ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను కోరారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శ్రీకాకుళం జిల్లా క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలుసుకొని క్రైస్తవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు వివరించారు.క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ వినతిపత్రం అందజేశామని చెప్పారు. క్రైస్తవులకు ప్రతీ మండలంలో స్మశానవాటిక నిర్మించాలని, ఎస్సీలు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే బీసీ'సి' ధ్రువపత్రాన్ని మంజూరు చేయాలని, తహశీల్దార్లకు అధికారాలు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. అదే విధంగా ఇటీవల రిమ్స్ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించిన వారిపై దురుసుగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్కర్ చర్యలు తీసుకోవాలని



కోరామన్నారు. హీ క్రిస్మస్ నిర్వాహకులు జిల్లా మైనారిటీ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని చెప్పారని వివరించారు. అనంతరం 2025 క్యాలెండర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రిష్టియన్ జాయింట్ కన్వీనర్స్ రెవ ఓంపూరు రమేష్, రెవ రాడ విజయకుమార్,రెవ జి శామ్యూల్ ఆరుణు కిరణ్,పాస్టర్ రెవ జార్జి ముల్లర్. టి.పీటర్, రెవ ఎ.ఇమాన్యుయేల్, పాస్టర్ యన్ శ్రీనివాస నాయక్, పాస్టర్ ప్రవీణ్ జోయ్ పాస్టర్ సి హ్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రెక్ చిత్తూరు కార్యక్రమానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**పలమనేరు, జనవరి 9 (నిఘా న్యూస్):** అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రెక్ చిత్తూరు కార్యక్రమానికి విచ్చేయాలని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డిని స్థానిక ఎఫ్.ఆర్.ఓ నారాయణ ఆహ్వానించారు. ఈనెల 12న పలమనేరు అటవీ పరిధిలోని మొగిలి వద్దనున్న దేవరకొండ లో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. కాబట్టి ఉదయం 6 గంటలకు కార్యక్రమానికి విచ్చేసి ప్రారంభించాలని ఆయన కోరారు. తదనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కుంకి ఏనుగుల ప్రాజెక్టు, గంగన్న శిరస్సు ప్రాజెక్టు తదితర అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫారెస్ట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సెంట్ మేరీ బేతని సిల్వర్ జూబ్లీ వేడుకలు



**నాగారం, జనవరి 9 (నిఘా న్యూస్):** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డ్ లో సెంట్ మేరీ బేతని కాన్వెంట్ విద్యాలయంలోనిర్వహించిన సిల్వర్ జూబ్లీ యానివర్సరీ ప్రోగ్రాంలో ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాతోనే పిల్లలకు మంచి బంగారు భవిష్యత్తు అని, మంచి నడవడిక, తప్పులు, ఒప్పుల గురుంచి తెలుస్తుందని ఆయన అన్నారు. ఇలాంటి కార్యక్రమంలు మరొన్నో జరుపుకోవాలని, పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని కోరారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్ని పిల్లను మంచిగా తీర్చి దిద్దాలని ఆయన స్కూల్ యాజమాన్యంను కోరారు. ఈ సిల్వర్ జూబ్లీకార్యక్రమంలోఆట పాటలు, నృత్య విన్యాసాలతో అలరించడం జరిగింది.సందర్భంగామేడ్చల్మల్కాజ్గిరియం.పి.ఈటల రాజేందర్‌స న్మానం చేశారు, నాగారం చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డికి వైస్ చైర్మన్ బండారిమల్లేష్‌యాదవ్ లను సన్మానం, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డికి సన్మానం చేయడం జరిగింది. కార్యక్రమంలో చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి,కౌన్సిలర్‌పంగ హరిబాబు, తెల్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సుల అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి



### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, జనవరి 9 (నిఘా న్యూస్):** రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారం ఆలస్యం అవుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇది తక్షణం ఆపాలి. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రీవెన్స్ నోడల్ ఆఫీసర్,రెవెన్యూ నోడల్ ఆఫీసర్,కంప్యూటర్ ఆపరేటర్లు సమన్వయంతో పని చేసి,రైతుల సమస్యలను తొందరగా పరిష్కరించాలి. వీఆర్వోలు తమ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలకు రసీదులు ఇవ్వాలని, అర్జీలను ఆన్‌లైన్ చేయాలని, అర్జీదారుల ఫోన్ నెంబర్లను సరిగ్గా నమోదు చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం గురించి తెలుసుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.అప్పారావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, లావణ్య,ఆయా మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు,రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు హాజరయ్యారు.

# సేవా దృక్పథం ఆర్యవైశ్యుల తొలి లక్షణం

### మహాసభ సభ్యత్వాలు తీసుకోవాలి

### ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది

**బాలాపూర్, జనవరి 9 (నిఘా న్యూస్):** సేవా కార్యక్రమాలలో బాలాపూర్ ఆర్యవైశ్య సంఘం ఎప్పుడూ ముందుంటుందని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మంద మల్లమ్మ క్రాస్ రోడ్స్ లో ఉన్న శ్రీ లక్ష్మి కన్వేషన్ హాల్లో బాలాపూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాళ్ల శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన బాలాపూర్ మండల నూతన ఆంగ్ల సంవత్సరం 2025 క్యాలెండరు ను జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ళకంటి కిరణ్ గుప్తాతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభ సభ్యత్వాలు ప్రతిఒక్కరూ తీసుకోవాలని సూచించారు. సంఘం ఎన్నికలలో సభ్యత్వం ఉన్నవారే పోల్గోని ఓటు వేయాలనే నియమం కఠినంగా అమలు చేస్తామని, సంఘంలో ఎంతమంది ఉన్నాసరే ఎన్నికలు మాత్రం నిర్వహిస్తామని అన్నారు. నాళ్ళ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ మండలంలో ఏ కార్యక్రమం చేసినా జిల్లాలోనే టాప్ ప్లేస్ లో ఉంటామని అన్నారు.



మండలంలో ఆర్యవైశ్యులు ఎక్కువగా ఉండడంతో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని వాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆలయం కొరకు పలుమార్లు కలిసి అభ్యర్థించగా, ఆర్యవైశ్య సంఘం చేసే కార్యక్రమాలు ఆర్యవైశ్యుల ఐక్యతను చూసి అమ్మవారి ఆలయానికి స్థలం కేటాయించదని అన్నారు. ఆలయాన్ని దాతల సహాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అల్మాస్ గూడ కు చెందిన కాలేజీ విద్యార్థిని ఐన చీదెల్ల సాయి ప్రియకు మురుకి శ్రీనివాస్ సహాయంతో సైకిల్ అందజేశారు. అనంతరం క్యాలెండర్ కు అడ్వర్టైజ్మెంట్లు ఇచ్చిన ప్రతి ఒక్కరినీ శాలువాతో సత్కరించారు. జిల్లా కోశాధికారి బద్రినాథ్ గుప్తా మాట్లాడుతూ బస్తీ సంఘాలన్ని ఐకమత్యంగా ఉండాలని, వ్యక్తిగత భేదాభిప్రాయాలు సంఘంపై చూపించ కూడదని, సంఘం అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. బడంగ్ పేట్ కార్పొరేషన్ అధ్యక్షులు తోపునూరి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ కన్యకా పరమేశ్వరీ ఆలయ కమిటీ, ఇతర సంఘాలు తమ కార్పొరేషన్ సంఘాన్ని చిన్నచూపు చూస్తున్నారని, జిల్లాలోని కొన్ని సంఘాలు సామూహికంగా జరుపుకొనే కార్యక్రమాలకు తమను ఆహ్వానించక పోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేస్తూ అది ఉద్దేశ్యపూర్వకంగా జరుగుతుందా లేదా తెలియక జరుగుతుందో అర్థం కావడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు దుద్దెళ్ళ రమాదేవి, కొత్త రవి గుప్తా, బి మహేష్ గుప్తా, ఎన్ నగేష్ గుప్తా, ఏ బాల్ లింగయ్య, యువజన సంఘం అధ్యక్షులు ఆంజనేయులు గుప్తా, జల్పల్లి అధ్యక్షులు ఎ చంద్ర ప్రకాష్, నాదర్ గుల్ అధ్యక్షులు వి ఓంకారం గుప్తా, తదితరులు పాల్గొన్నారు.



మాజీ శాసన మండలి సభ్యులు రాములు నాయక్ కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వి.హనుమంత రావు సంఘ సేవకుడు చిన్న శ్రీశైలం యాదవ్, బండ అశోక్ కురుమ, మౌసిన రాజు గౌడ్ కోటం అనిల్ కుమార్, రావుల సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు.
*–హైదరాబాద్, జనవరి 9 (నిఘా న్యూస్):*

## భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన సంధ్యారాణి



**వరంగల్, జనవరి 9 (నిఘా న్యూస్):** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని గురువారం సాయంకాలం వరంగల్ జోన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ గా నూతనముగా పదవీ బాధ్యతలు చేపట్టిన సంధ్యారాణి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన డిప్యూటీ కమీషనర్ కు ఆలయ సహాయ కమీషనర్, ఈ.ఓ శేషుభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు మంగళవాద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించగా ఈ.ఓ శేషుభారతి అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి ప్రసాదములు అందజేశారు. అనంతరం అమ్మవారి స్థలపురాణంను ప్రధానార్చకులు, డిప్యూటీ కమీషనర్ సంధ్యారాణికి వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పర్యవేక్షకులు విజయ్ కుమార్, అకౌంటెంట్ హరినాథ్ సిబ్బంది తదితరులున్నారు.

## ఢిల్లీ ఎన్నికల్లో.. ఒకే స్థానం నుండి కేజ్రీవాల్ పోటీ

**న్యూఢిల్లీ, జనవరి 9 (నిఘా న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో. అధికార, విపక్ష పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. న్యూ ఢల్లీతోపాటు మరో స్థానం నుంచి కేజ్రీ పోటీ చేయబోతున్నారంటూ బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. బీజేపీ నేతల ఆరోపణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా, న్యూ ఢిల్లీ స్థానం నుంచి కేజ్రీ వరుసగా నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై బీజేపీ తరఫున మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విక్టరీతో మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ భావిస్తున్నది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

## గత పది రోజులుగా శ్రమించి..

### పాపను తల్లి తండ్రులకు అప్పగించిన పోలీసులు

**వేములవాడ, జనవరి 9 (నిఘా న్యూస్):** వేములవాడ రాజన్న ఆలయం సమీపంలో గుర్తు తెలియని మహిళలు చిన్నారిని అపహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన అధ్విత మిస్సింగ్ కేసును శోధించి ఛేదించిన జిల్లా పోలీసులు పాప మిస్సింగ్ కేసును ఛాలెంజ్ గా తీసుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చి డిసెంబర్ 23న ఆలయ ప్రాంగణంలో తప్పిపోయిన జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చింతలపల్లి



గ్రామానికి చెందిన సింగారపు అద్విత (4) కేసును పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బాలిక మిస్సింగ్ కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక బృందాలతో గత పది రోజులుగా పాపను గుర్తించే పనిలో పడ్డారు. ఎంతో శ్రమించి పాప ఆచూకీని ఖమ్మం జిల్లా సీసీఎస్ పోలీసుల సహాకారంతో కనుగొని వేములవాడ పోలీస్ స్టేషన్ కు తీసుకొని వచ్చి పాప తల్లిదండ్రులకు అప్పజెప్పారు. తమ పాపను అప్పగించినందుకు వేములవాడ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేసిన పాప బందువులు.

## బోడుప్పల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

### 43 కోట్ల అభివృద్ధి పనులకు ఏకగ్రీవ ఆమోదం




**బోడుప్పల్, జనవరి 9 (నిఘా న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశము జరిగినది. ఈ సమావేశంలో పలు డివిజన్ లలో నూతన డ్రైనేజి నిర్మాణములకు, నూతన బి.టి, సి.సి రోడ్ల నిర్మాణములకు, పలు అభివృద్ధి కార్యక్రమములకు సుమారు 43.37 కోట్ల రూపాయల పనులకు ఏకగ్రీవముగా ఆమోదం తెలిపారు. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సమావేశమునకు కమీషనర్ జి.రామలింగం, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నగర పాలక సంస్థ శాఖలకు సంబందించిన అధికారులు పాల్గొనడం జరిగినది.

# నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేయాలి

- తొలి ఏడాది 11 వేలకు పైగా ఉపాధ్యాయుల భర్తీ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**ఖమ్మం, జనవరి 9 (నిఘా న్యూస్):** ఖమ్మం జిల్లాలోని డైట్ కళాశాల ద్వారా నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేసి సమాజానికి అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత,జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.గురువారం మంత్రి, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని ఏడవ డివిజన్ టేకులపల్లిలో పర్యటించి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి డైట్ అడ్మినిస్ట్రేటివ్ భవన ఆధునీకరణ, అదనపు సదుపాయాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 70 సంవత్సరాలలో అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యను అభివృద్ధి చేయలేక పోయామని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమైందని, దీనివల్ల అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయని మంత్రి తెలిపారు.జీవితంలో ఎదిగి ఒక స్థాయిలో ఉన్న ప్రతి వ్యక్తికి ఏదో ఒక దశలో ఒక ఉపాధ్యాయుడు మార్గం చూపే ఉంటారని మంత్రి అన్నారు. మనం ప్రస్తుతం మంత్రులుగా, ఉన్నతాధి కారులుగా ఉండటానికి మన గురువులు మూలమని అన్నారు. ప్రస్తుత డైట్ కళాశాలల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు భవిష్యత్తులో



గొప్ప టీచర్లుగా తయారు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.నైపుణ్యత ఉన్న ఉపాధ్యాయుల కొరత ఉండటం వల్ల విద్యా ప్రాముఖ్యత, ప్రమాణాలు తగ్గుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో పిల్లలకు పూర్తి పరిజ్ఞానంతో సంపూర్ణ విద్య అందించేలా డైట్ కళాశాల నుంచి ఉపాధ్యాయులు బయటకు రావాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 11 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశామని, ప్రతి సంవత్సరం ఖాళీ అవుతున్న టీచర్ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తామని అన్నారు.డైట్ కళాశాల కాంపౌండ్ గ్రీనరీ తో పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండే విధంగా తయారు చేయాలని అన్నారు.డైట్ కళాశాలలో ఎటువంటి మొక్కలు నాటాలో ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుని విద్యార్థుల సహకారంతో గ్రీనరీ పెంచాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రజల శ్రేయస్సు కొరకు సమన్వయంతో పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ మాట్లాడుతూ ప్రస్తుత యువతలో ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆసక్తి వ్యక్తం చేసే వారి సంఖ్య తగ్గుతుందని, ఖమ్మం డైట్ కళాశాల నుంచి అద్భుతమైన ఉపాధ్యాయులు తయారు అయ్యారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిని ప్రోత్సహించాలంటే నాణ్యమైన ఉపాధ్యాయులను తయారు చేయాల్సిన అవసరం ఉంటుందని, ఇందులో భాగంగా డైట్ కళాశాల పరిపాలన భవన ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా మంచి పరిణామం అని అన్నారు.ఖమ్మం డైట్ కళాశాల వద్ద ఏర్పాటు చేసే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో అనేక వసతులు ఉంటాయని, వీటిని ఉపయోగించుకోవాలని, డైట్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఇక్కడ మౌళిక వసతులను వీలైనంత త్వరగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని, డైట్ కళాశాల నుంచి సమాజానికి నాణ్యమైన ఉపాధ్యాయులు బయటికి రావాలని, భవిష్యత్తు తరాల పిల్లలను ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, డి.ఈ.ఓ. సోమశేఖరశర్మ, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, ఖమ్మం అర్బన్ తహశీల్దార్ రవికుమార్, అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్‌రావు గృహ నిర్బంధం

### కోకాపేటలోని ఆయన గృహం వద్ద భారీగా మోహరించిన పోలీసులు

**హైదరాబాద్, జనవరి 9 (నిఘా న్యూస్):** బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిర్బంధాలు కొనసాగిస్తున్నది. అక్రమ కేసులు, ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు విధిస్తూ ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకోవాలని చూస్తున్నది. ఇందులో భాగంగా సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గురువారం ఉదయంమే కోకాపేటలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఇంట్లో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. హరీశ్‌రావును కలవడానికి కూడా ఎవరినీ అనుమతించడం లేదు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నారు. కాగా, ఏసీబీ విచారణకు న్యాయవాదితో వెళ్లేందుకు హైకోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కేటీఆర్‌ను విచారించే ఏసీబీ కార్యాలయంలో దర్యాప్తు గదికి పకనే ఉన్న గ్రంథాలయ గదిలో న్యాయవాది ఉండేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలన్న ప్రతిపాదన పట్ల సానుకూలంగా స్పందించలేదు. గురువారం జరిగే విచారణ తీరును బట్టి అవసరమైతే పిటిషనర్ మళ్లీ కోర్టుకు రావచ్చని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6న ఏసీబీ దర్యాప్తుకు న్యాయవాదిని వెంటబెట్టుకుని వెళ్తే పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం భోజన విరామ సమయంలో హైకోర్టు అత్యవసర విచారణ జరిపింది.

# శతాధిక వృద్ధుడు రావుల లక్ష్మయ్య మృతి

**వరంగల్, జనవరి 9 (నిఘా న్యూస్):** వరంగల్ జిల్లా రంగశాయిపేటకు చెందిన రావుల లక్ష్మయ్య (110) ఇకలేరు. లక్ష్మయ్య గత కొంత కాలంగా అస్వస్థతకు గురి అయ్యారు. కరోనా వైరస్ పై పోరాడి విజయం సాధించిన లక్ష్మయ్య తన భూమి కబ్జా అవుతుందనే మానసిక వేదనాకు గురి అయ్యారు. ఆర్ కటిక కులానికి చెందిన లక్ష్మయ్యకు ఐదుగురు కూతుర్లు ఉండగా భార్య 2021 లో మృతి చెందింది. తన భూమిలో వ్యవసాయం చేస్తూ ఎలాంటి దురాలవాట్లు లేకుండా పలువురికి ఆదర్శంగా ఉండేవాడు. ప్రతీ రోజు పూజా మందిరంలో కూర్చొని ప్రాణాయామం చేసుకునేవారు. ఆలన్తి జీవన శైలే లక్ష్మయ్యను వందేళ్లు బ్రతికేలా చేశాయి. ఇప్పటి వరకు ప్రాంతంలో లక్ష్మయ్యనే గ్రాండ్ ఓల్డ్ మాన్ గా గుర్తింపు పొందారు. అయితే కొంత కాలంగా లక్ష్మయ్య ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటుండగా తన భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి



ఆక్రమించారు. న్యాయ పరంగా గెలిచినా ఆక్రమణకు గురి అయిన భూమిని స్వాధీనం చేసుకోలేకపోయారు. తన కూతుర్ల కోసం కాపాడుకున్న భూమిని కోల్పోతానేమో అనే మనోవేదనకు గురి అవుతూ గురువారం తన ఇంట్లోనే తుది శ్వాస వదిలారు. లక్ష్మయ్య మృతితో కుటుంబంలో, బంధు వర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పలువురి నివాళులు. లక్ష్మయ్య మృతి పట్ల పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన, ఆరెకటిక సంఘం అధ్యక్షులు జాతీయ నాయకులు రావుల బాలరాజు, రావుల నవీన్, ప్రవీణ్, రాజు, మహేష్, రాజు, గంగాదర్, నర్సోజీ, శ్రవణ్, సురేష్, రాజు, చిన్ని, గోగికార్ నాగరాజు తదితరులు లక్ష్మయ్య భౌతిక కాయానికి నివాలులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# పర్యాటక ప్రాంతంగా ఖమ్మం ఖిల్లా అభివృద్ధి

**ఖమ్మం, జనవరి 9 (నిఘా న్యూస్):** ఖమ్మం ఖిల్లా పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేయనున్న రోప్ వే, జాఫర్ బావి అభివృద్ధితో ఖమ్మం పర్యాటక ప్రాంతంగా మారుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఖమ్మం ఖిల్లా ప్రాంతం పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా జాఫర్ బావి పునరుద్ధరణతో పాటు, పర్యాటకులు సురక్షితంగా ఆహ్లాదకర వాతావరణంలో ఖిల్లా పైకి వెళ్లి సందర్శించే విధంగా రోప్ వే ఏర్పాటుకు కలెక్టర్ ఖిల్లా మెట్ల మార్గం ద్వారా అధికారులతో కలిసి ఖిల్లా పైకి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖమ్మం ఖిల్లాకు రోప్ వే ఏర్పాటుకు అనువుగా ఉండే మార్గం, ఎక్విప్మెంట్, ఖమ్మం ఖిల్లాకు రావడానికి రోడ్డు అనుకూలత, పార్కింగ్, టాయిలెట్స్ ఏర్పాటుపై పరిసరాలను తిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు.అంతకు ముందు జాఫర్ బావిని, బావి వైపు జరుగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ డా. శ్రీజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖిల్లాపై పర్యాటక లకు ఆహ్లాదం కలిగే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మంత్రుల ఆదేశాల మేరకు ప్రజలకు అనుకూలంగా ఖిల్లాకు పూర్వ వైభవం వచ్చే విధంగా తీర్చిదిద్దుతామని అన్నారు. లైటింగ్, అనువైన పార్కింగ్ పనులు



ప్రారంభిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, అర్బన్ తహసీల్దార్? రవికుమార్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఉన్నారు.

# పోలీసు సేవల ఫీడ్‌బ్యాక్ కోసం క్యూఆర్ కోడ్




### క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం, జనవరి 9 (నిఘా న్యూస్):** పోలీసుల పనితీరు,పోలీసులపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. డీజీపీ కార్యాలయం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీ లతో గురువారం జరిగిన సమావేశం డీజీపీ డాక్టర్ జితేందర్ క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను లాంఛనంగా ప్రారంభించారు. బాధితులు సమస్యలు విన్నవించేందుకు పోలీస్ స్టేషన్లకు వెళ్లిన అనంతరం పోలీస్ సిబ్బంది వ్యవహరించిన తీరు, ఫిర్యాదులు మొదలు పాస్‌పోర్ట్ వేరిఫికేషన్, ఈ - చలాన్, ఎఫ్ ఐ ఆర్,ఇతర సేవల గురించి పోలీస్ సిబ్బందిపై ప్రజలకు ఉన్న అభిప్రాయాలను సేకరించేందుకు క్యూ ఆర్ కోడ్ అందుబాటులో తీసుకొని రావడం జరిగిందని, ఈ పోస్టర్లు పోలీస్ కమిషనర్ కార్యాలయంతో పాటు అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, ఏసీపీ కార్యాలయల్లో స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో వుండే క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ ప్రజలు సద్వినియోగం చేసుకోని సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, ట్రైనీ ఐపిఎస్ అధికారి రుత్వక్ సాయి పాల్గొన్నారు.

## విద్యతో సంపూర్ణ అభివృద్ధి సాధిస్తాం

### విద్య వాలంటరీ వేతనం అందించిన దొంతిరి హరి శంకర్ రెడ్డి



**మేడిపల్లి, జనవరి 09 (నిఘా న్యూస్):** ఇక్కుర్తి గ్రామ అభివృద్ధి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి తమ స్వగ్రామాన్ని అన్ని రంగాలలో అగ్రభాగాన నిలుపుతానని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగాన్ని మెరుగుపరచడానికి, నాణ్యమైన విద్యా అందించడానికి 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ, చక్కగా చదువుకోవాలని మీకు అవసరమైన అన్నిరకాల వసతులు సమాకురుస్తానని, 10వ తరగతిలో మంచి గ్రేడ్ తెచ్చుకొని ఉపాధ్యయులకు, తల్లితండ్రులకు, ఊరికి మంచిపేరు తేవాలని తెలిపారు. ఉపాధ్యాయుల కొరతను తీరుస్తూ, విద్యవాలంటరిలను కొనసాగిస్తానని తన పుట్టిన ఊరి రుణం తీర్చుకోవడానికి నాకు ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు. అదే విధంగా పాఠశాలలో విద్యా వాలంటీర్ కు సాలరీని ప్రధానోపాధ్యాయులు సమక్షంలో అందించారు. అనంతరం గ్రామ వాస్తవ్యులు కోరుటూరి బాలరాజు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమరేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస చార్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

**పెద్ద పంజాణి జనవరి 9 (నిఘా న్యూస్):** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం లో



అంతరాష్ట్ర మద్యం తరలిస్తున్న వ్యక్తిని పెద్దపంజాణి మండల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజుపల్లెలోని ఎన్ డి పి ఎల్ పై దాడి చేసి, పంజాణి మండలం అప్పినపల్లె గ్రామానికి చెందిన గంగాదర్ రెడ్డి అనే వ్యక్తిని పట్టుకుని, అతని వద్ద నుండి 92 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. అమ్మ రాజు పల్లి గ్రామానికి చెందిన మాధవ రెడ్డి అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని, వారిపై నమోదు చేయబడిందని పెద్దపంజాణి మండలం ఎస్సై సహదేవి తెలిపారు.

## ఆర్ కృష్ణయ్యకు స్వాగత సన్మానం



**తిరుపతి, జనవరి 9 (నిఘా న్యూస్):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యకు తిరుపతి బీసీ నాయకులు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం తన మిత్రబృందంతో సన్మానించారు, గురువారం రాత్రి తిరుపతి విమానాశ్రయానికి విచ్చేసిన జాతీయ బీసీ నాయకులు ఆర్.కృష్ణయ్య ను తిరుపతి బీసీ నాయకులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం, తిరుపతి జిల్లా అధ్యక్షులు తురక అమర్నాథ్, జిల్లా ఉపాధ్యక్షులు అట్ల కిషోర్,జిల్లా అధికార ప్రతినిధి రామారావు, పనబాకం సురేష్‌లు మర్యాదపూర్వ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ముత్యాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు



**అశ్వారావుపేట, జనవరి 9 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలోని శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ ఆలయంలో గురువారం ఆలయ కమిటీ సమక్షంలో హుండీ ఆదాయం లెక్కించారు. 2024 సెప్టెంబర్ 23 నుంచి 2025 జనవరి 9 వరకు కలిగిన మొత్తం హుండీ ఆదాయం రూ.1,81,558గా నమోదైంది. హుండీ ఆదాయం లెక్కింపును పారదర్శకంగా నిర్వహించినట్టు అధికారికంగా తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ అభివృద్ధికి ఈ నిధులు వినియోగిస్తామని ఆలయ కమిటీ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి. బెయిల్ సింగ్, మేనేజర్ బి.సూర్యప్రకాష్ రావు, దేవాదాయ చైర్మన్ నరాల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఇళ్ల నాగేంద్ర, ఇళ్ల నిర్మల, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కరుణాకర్ రెడ్డి శవ రాజకీయాలు మానుకో

**తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి, జనవరి 9 (నిఘా న్యూస్):** వైకుంఠ ద్వార దర్శనం టికెట్స్ కోసం జరిగిన తొక్కిసలాటలో ఐదు మంది మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. తొక్కిసలాటలో గాయపడి పద్మావతి మెడికల్ కాలేజిలో చికిత్స పొందుతున్న భక్తులను ఆయన గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ భక్తుల మనోభావాలను కించపరిచేలా మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసిపి కి ప్రతిపక్ష హెూదా కూడా ప్రజలు ఇవ్వలేదన్న సంగతి కరుణాకర్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని ఆయన అన్నారు. ఈ ఘటన పట్ల చింతించాల్సింది పోయి బుద్ధి లేకుండా కరుణాకర్ రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నాడని ఆయన విమర్శించారు. ప్రధాని మోది సహా పలువురు నాయకులు భక్తులు మృతి చెందిన ఘటనపట్ల చింతిస్తుంటే కరుణాకర్ రెడ్డి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లను విమర్శించే స్థాయి కరుణాకర్ రెడ్డికి లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు 25 లక్షలు ఎక్స్ గ్రేసియ ప్రకటించిందని ఆయన తెలిపారు.

## విద్యాశాఖ కార్యదర్శిగా యోగితా రాణా

**రవాణా శాఖ కమిషనర్‌గా కే. సురేంద్ర మోహన్ నియామకం**



**హైదరాబాద్, జనవరి 9 (నిఘా న్యూస్):** విద్యాశాఖ సెక్రెటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారిణి యోగితా రాణా నియమితులయ్యారు. 2003 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాణా, ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా భాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయతే విద్యాశాఖ సెక్రెటరీగా ఉన్న బుర్రా వెంకటేశంను రాష్ట్ర ప్రభు త్వం గతేడాది డిసెంబర్‌లో టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియ మించింది. దీంతో ఎన్, శ్రీధర్‌కు అదనపు బాధ్య తలు అప్పగించారు. తాజాగా యోగితా రాణాను సెక్రెటరీగా నియమించడంతో శ్రీధర్‌ను ఆ బాధ్యతల నుంచి విద్యాశాఖ రిలీవ్ చేసింది.కాగా, ఎన్. శ్రీధర్‌కు గనుల శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా 2006 బ్యాచ్‌కు చెందిన కే. సురేంద్ర మోహన్‌ను రవాణా శాఖ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం ఆదేశాలు జారీచేశారు. యోగితా రాణా. 2003 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. 2002లో సివిల్ సర్వీసెస్‌లో మూడో ప్రయ త్నంలో ఐఆర్‌టీఎస్‌కు ఎంపికయ్యారు. 2003లో సివిల్స్‌లో నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించ డంతో విశాఖ జిల్లాలో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్‌గా, రంపచోడవరం ఐటీడీఏ పీఓగా పనిచేశా రు. ఆ తర్వాత యూఎన్ డీపీలో మూడున్నరేండ్లు బాధ్యతలు నిర్వహించారు. 2017లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ 'ఈ-నామ్' అమలులో జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ నుండీ అవార్డు అందుకున్నారు.

## పోలీస్ సేవలపై ప్రజా భిప్రాయం సేకరణ

**వాల్ పోస్టర్ ఆవిష్కరించిన మల్కాజ్గిరి ఏసిపి చక్రపాణి**



**ఉప్పల్, జనవరి 9(నిఘా న్యూస్):** తెలంగాణ పోలీస్ సేవలపై ప్రజల అభిప్రాయం పోస్టర్ ను రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మల్కాజ్గిరి ఏసిపి కార్యాలయంలో ఏసీపీ చక్రపాణి,ఉప్పల్ సీఐ ఎన్.ఎలక్షన్ రెడ్డి,ఉప్పల్ డి.ఐ.రామలింగారెడ్డితో కలిసి గురువారం ఆవిష్కరించారు.ఈ పోస్టర్ ముఖ్య ఉద్దేశం ప్రజలు నేరుగా తమ ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్ లు, ట్రాఫిక్ ఈ చలాన్, పాస్ పోర్ట్ వెరిఫికేషన్, ఇతర అంశాలను స్కానర్ ద్వారా తెలుసుకోవచ్చని ఏసీపీ చక్రపాణి అన్నారు. ఈ పోస్టర్ అన్ని పోలీస్ స్టేషన్ల ఆవరణలో అందుబాటులో ఉంటాయని ప్రజల ఫీడ్ బ్యాక్ కూడా స్కానర్ ద్వారా తెలుపవచ్చును. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఏసిపి కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ. మధు పాల్గొన్నారు.

## వైరస్ పై వదంతులను నమ్మ వద్దు

**విమ్స్‌లో వైరెస్‌కి 20పడకల వార్డు ఏర్పాటు**




**విశాఖపట్నం, జనవరి 9 (నిఘా న్యూస్):** హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ హెచ్ఎంపీవీ కేసులు దేశంలో నమోదు కావడంతో కోవిడ్ లో వేలాది మందికి వైద్యం అందించిన విశాఖ విమ్స్ ఆస్పత్రి అలర్ట్ అయింది.వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించడం కోసం ముందస్తు చర్యగా విమ్స్ ఆసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. వైరస్ పై వస్తున్న వదంతులు నమ్మవద్దని ఇది ప్రాణాంతకం కాదని సాధారణ ఫ్లూ వైరస్ లక్షణాలు కనిపిస్తాయని తెలియజేసింది.

# రాయలసీమకు అన్యాయం చేస్తున్న తెలుగుదేశం

- ఇప్పటికే అనేక కార్యాలయాలను అమరావతికి తరలించారు
- ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలి
- ఈనెల 12న సీమ సదస్సును విజయవంతం చేయండి
- సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులురెడ్డి

**కడప, జనవరి 9 (నిఘా న్యూస్):** కడపలోని ఎ పి జిబి.ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించుకు పోవాలని ప్రభుత్వ పెద్దలు కృతనిశ్చయంతో ఉన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కామనురు శ్రీనివాసులురెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12న కడప నగరంలోని ఐఎంఏ హాల్లో రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో జరగబోయే సదస్సుకు సంపూర్ణ మద్దతు ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సంప్రదాయం, మార్గదర్శకాల్ని పక్కకుతోసి తమ పంతం నెగ్గించుకోవాలని చూస్తున్నారు. ఈ అన్యాయాన్ని మనం తిప్పికొట్టాలి. పాలకులు, పాలక పార్టీలు ఏవైనా సరే, దశాబ్దాల తరబడి రాయలసీమ బిడ్డలుగా మనం 'సవతి తల్లి' నిర్లక్ష్యానికి గురవుతున్నాం. తిరుగులేని సత్యమిది. మళ్ళీ మళ్ళీ పునరావృతం అవుతున్న విషాదమిది. ఇప్పటికే మన కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్ లో భాగమైన ఎంఎస్ఎం ఈ టెక్నాలజీ సెంటర్ అమరావతికి తీసుకుపోయారు. తాజాగా, రాయలసీమ నుంచి లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఏపీఈఆర్సీ, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు అమరావతికి తరలిస్తున్నారన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాయలసీమ నడిబొడ్డున ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపును దృఢంగా మనం ప్రతిఘటించాల్సి ఉంది. ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం అంటే రాయలసీమ ప్రజలంటే వరుస పాలకులకు లెక్కలేనితనమే కారణం. గ్రామీణ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్ణయించబడే ప్రధాన కార్యాలయం మన లాంటి వెనకబడిన జిల్లాలకే అవసరం ఎక్కువ. అంతేకాక, ప్రధాన కార్యాలయం ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలకు వీలు కల్పిస్తుంది. మనలాంటి పేద, మధ్యతరగతి, చిన్న సన్నకారు రైతులకు, చిన్నచిన్న వ్యాపారులకు, డ్వాక్రా సంఘాలు, చేతివృత్తులు, చిన్న పరిశ్రమలు, స్వయం ఉపాధి సంఘాలకు, ఎదిగొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇలా అనేక రకాల వారికి రుణాలను ఇచ్చే బ్యాంకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రాయలసీమకు జరిగిన అనేక అన్యాయాల కొనసాగింపుగానే అన్ని సంస్థల తరలింపు జరుగుతున్నది. ఏపీజీబీ తరలింపును అడ్డుకోకపోతే, రాయలసీమకు నష్టం చేసే మరెన్నో నిర్ణయాలు ఈ మంచి ప్రభుత్వం కూడా చేస్తున్నది. రాయలసీమ పట్ల వివక్షను, జరిగే అన్యాయాలను కడదాకా ప్రతిఘటించడం నేటితరం కర్తవ్యం. లేకపోతే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవు. ఈ కార్యక్రమానికి ఉపన్యాసకులుగా సి.ఓబుల్ రెడ్డి కన్వీనర్, రాయలసీమ అభివృద్ధి వేదిక, సాకే శైలజానాథ్, వై జయరాజు, రామానాయుడు ,కె.ప్రభాకర్ రెడ్డి, హరి కిషోర్ రెడ్డి, ఎన్ రవిశంకర్ రెడ్డి హాజరవుతారు. లక్ష్య సాధన కోసం జరుగుతున్న సీమ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.




# ముగియనున్న మున్సిపల్ కాలపరిమితి

**అక్రమాలకు తెరలేపిన నాయక గణం**

**నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఫామ్ హౌస్ నిర్మాణం**

**కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ ఖాయం అంటున్న ఆదివాసీ సంఘాలు**






**ఇల్లందు, జనవరి 9(నిఘా న్యూస్):** మరో పదహారు రోజుల్లో ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియ నుండటంతో ఫామ్ హౌస్ ప్రారంభోత్సవానికి హడావిడిగా అక్రమంగా నిర్మిస్తున్న పనులు చివరి దశకు చేరాయంటూ ఆదివాసి సంఘాలు పేర్కొన్నాయి. గడచిన ఐదేళ్ల పాలనలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే కేవలం చెరువు స్లం యాక్ట్ కు విరుద్ధంగా మున్సిపల్ పర్మిషన్ లేకుండా నిర్మిస్తున్న ఫామ్ హౌస్ అని చెప్పుకోక తప్పదన్నారు. ఈ ఫామ్ హౌస్‌కు మున్సిపల్ డైలీ వేజ్ వర్కర్లను సైతం పనులకు వాడడం గమనర్హం. ఇల్లందులో పాలకవర్గం తీరు ప్రజల పాలిటి గుదిబండల తయారయిందని తెలిపారు.ప్రభుత్వం మారింది పార్టీలు మారారు ఆ నేతలో మార్పు లేదంటున్న సంఘాలు. కమీషన్ల తో ఫామ్ హౌస్ కట్టే ఆదర్శ నేత అంటున్నారు. గడిచిన ఐదేళ్లలో పాలకవర్గం పనితీరు ఎలా ఉందంటే. మొండి గోడలతో మొదలై సగానికే పరిమితమైన పిల్లర్లుగా నిలబడ్డాయన్నారు. లచ్చగూడెం ఇటుక పరిశ్రమ ఇటుకల సేలింగ్ కోసం మెయిన్ రోడ్ హై స్కూల్ గ్రౌండ్ ను కాస్త మార్చి పనికి రాని గదులను నిర్మింప చేసిన ఘనత వారిదే నన్నారు. హరితహారంలో భాగంగా లక్షలు వెచ్చించి ముందుచూపు లేకుండా రోడ్లకు ఇరువైపులా మానవాళికి హాని కలిగే మొక్కలను నాటి వాటిని తొలగించడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ రైల్వే స్థలాలలో పల్లె ప్రకృతి వనాల నిర్మింప చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణంలో నాళాల నిర్మాణాలపై చర్యలు చేపట్టకుండా ఉండటం ఆ నేతకే చెల్లింది అన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కో కొల్లలుగా ఉన్నాయన్నారు. అభివృద్ధి మాటున ఫామ్ హౌస్ కట్టడం అంటే ఇదేనేమో అంటూ ప్రశ్నలు గుప్పిస్తున్న ప్రజలు ఆదివాసి నాయకులు, ఎలా పడితే అలా చేసి అభివృద్ధి చేశామంటూ చెప్పే ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు కట్టే పన్నులు రాష్ట్ర ఖజానా నుండి పట్టణ అభివృద్ధికి తెచ్చిన నిధులు దుర్వినియోగం చెయ్యడంపై మండిపడుతున్న సంఘాలు, ఐదేళ్లకో సారీ కోట్లు తెస్తున్నా ఎక్కడ ఏసిన గొంగళి అక్కడే ఉందన్నారు. గడిచిన ఐదేళ్ల లో చేసిన అభివృద్ధి పనులకు శ్వేత పత్రం విడుదల చెయ్యాలన్నారు. రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో పాలకవర్గం తీరుకు అధికార పార్టీకి కనీవినీ ఎరగని రీతిలో ఎదురు దెబ్బ తప్పదంటున్న ఆదివాసి సంఘాలు.

# వంశధార ప్రాజెక్టుపై మంత్రుల నిర్లక్ష్యం తగదు

- ఆధునీకరణకు ప్రభుత్వం రూ.1500 కోట్లు కేటాయించాలి
- ప్రాజెక్టును ఆధునికరిస్తే 1000 కోట్ల ఆదాయం వస్తుంది
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు



**శ్రీకాకుళం, జనవరి 9 (నిఘా న్యూస్):** వంశధార ప్రాజెక్టు ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు వెంటనే కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కే.మోహన్ రావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ వంశధార ప్రాజక్ట్ శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో గుండెకాయ వంటిదని, వంశధార ప్రాజెక్టు నిర్మించి 50సంవత్సరాలు కావస్తుంది,ప్రాజెక్టు శిధిలావస్థకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలం అయితే జిల్లాలో వ్యవసాయ రంగం మొత్తం కుప్పకూలిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజక్ట్ ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.వంశధార నది ఎడమ కాలువ ద్వారా లక్ష ఏబై వేల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80వేల ఎకరాలు,హై లెవెల్ కెనాల్ ద్వారా 5వేల ఎకరాలు, ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా 20వేల ఎకరాలుకు నీరు అందిస్తున్నది. వంశధార ప్రాజెక్టు నిర్వహణకు నిధులు లేక శిధిలావస్థలో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వంశధార ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు.వంశధార ఆధునీకరణ కోసం కుడి కాలువ 104 కిలోమీటర్లు ఎడమ కాలువ 73 కిలోమీటర్లు పొడవునా లైనింగ్ చేయడం కోసం 800 కోట్లు,250 స్ట్రక్చర్స్ పునర్ నిర్మాణం కోసం 300 కోట్లు, షెట్టర్స్ కోసం 100కోట్లు,పిల్ల కాలువలు మరమ్మత్తు కోసం 300 కోట్లు, నిధులు అవసరం అవుతాయని నిపుణులు చెబుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారన్నారు. పాలకులు నిర్లక్ష్యమే శ్రీకాకుళం జిల్లా వెనుకబాటుకు కారణం అని వారు విమర్శించారు. వంశధార ప్రాజెక్టు ఆధునీకరణ చేసి రెండు పంటలకు నీరు ఇస్తే వ్యవసాయ రంగం నుండి 1000 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని, తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు వస్తాయని, వలసలు నివారించి జిల్లా అభివృద్ధి చెందుతుందని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎస్.ఐ.ఎం.పి. (సపోర్ట్ ఫర్ ఇంప్రూ వ్ మెంట్ అండ్ మోడరైజేషన్ ఆఫ్ ప్రాజక్ట్)వంశధార బ్యారేజి ఆధునికరణ కోసం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎందుకు నిధులు తేవడం లేదని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార బ్యారేజీను ఆధునికరణ చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా అభివృద్ధి చెందాలంటే ప్రజల ఆస్తులను కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కాదని, నదీ జలాలను వినియోగించుకోవడం ద్వారా మాత్రమే అభివృద్ధి అవుతుందని అన్నారు. వంశధార ప్రాజెక్టు ఆధునీకరణ కోసం దశల వారి పోరాటాలు చేస్తామని వారన్నారు.


### ఏడు లక్షల కోట్లు అప్పుచేసి...

# లక్ష రుణమాఫీ చేయని బిఆర్ఎస్

**ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే రైతులను ఆగం చేశారు**

**రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట**

**33/11కేవి విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభంలో డిప్యూటీ సీఎం భట్టి**



**పెబ్బేరు, జనవరి 9(నిఘా న్యూస్):** ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా సంక్షేమ పథకాల అమలు మాత్రం ఆగదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వనపర్తి నియోజకవర్గంలో విద్యుత్ ఉప కేంద్రాల శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి రేవల్లి మండలం తల్పునూర్ గ్రామానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్వాగతం పలికారు.అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అలాగే గోపాల్ పేట మండలం ఏదుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11కేవి విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేసి తీరుతామన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని అన్నారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా పాత పథకాలకు కోత విధించడం లేదన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500ఇళ్లకు తగ్గకుండా ఇస్తామని ఆయన ప్రకటించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12వేలు ఇస్తామన్నారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే రూ.లక్ష రుణమాఫీ సైతం చేయలేక పోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ రూ. 7లక్షల కోట్లు అప్పు చేసి కూడా రుణమాఫీ చెయ్య లేక చేతులు ఎత్తేసిందని ఎద్దేవా చేశారు.తాము ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రూ. 2లక్షల లోపు ఉన్న రైతులకు రుణ మాఫీ కాకపోతే తప్పకుండా చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, కేటీఆర్‌లు అడ్డగోలుగా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిద్దరి మాటలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతుందని వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 56వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఇక రైతులకు బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కానీ ఈ అంశంపై బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణా రావు, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

## గౌతమీ నదిలో రామయ్య తెప్పోత్సవం

**వైభవంగా రామయ్య వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు**

**నేడు వైకుంఠ ద్వార దర్శనం**



**భద్రాచలం, జనవరి 9 (నిఘా న్యూస్):** రామయ్య సూర్య ప్రభ హంసవాహనంపై గోదావరి నదిలో ఐదు సార్లు విహరించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు రామయ్య వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా దశావతారాలలో భక్తులకు దర్శనం ఇచ్చి సీతా లక్ష్మణ సమేతుడై నదీ విహారానికి రావడంతో గోదారమ్మ పులకించింది.భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా డిసెంబర్ 31 నుండి దశావతారాలలో భక్తులను అనుగ్రహించిన రామయ్యకు పవిత్ర గౌతమీ నదిలో హంస వాహనంలో సూర్య ప్రభ వాహనంపై వేంచేసి ఉండగా తెప్పోత్సవం వైభవంగా జరిగింది.గురువారం నిత్య విధి అనంతరం పగల్ పత్తు సమాప్తి సూచకంగా పరకాల మునులు పరమ పదోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఇప్పటి వరకు జరిపిన పరాయణాను ఈ ఉత్సవం ద్వారా పరిసమాప్తి చేశారు.ఈ వేడుకను తిలకించిదానికి సుదూర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు భద్రాద్రి చేరుకోవడంతో భద్రాద్రి భక్తాద్రిగా మారింది.భద్రాచలం దివ్యక్షేత్రం భక్తుల శ్రీరామ నామస్మరణతో మారు మోగింది.

### నేడు వైకుంఠ ద్వార దర్శనం

అధ్యయనోత్సవాలలో భాగంగా గురువారం స్వామి వారు నదీ విహారం చేయగా, ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై ఆశీనులై తెల్లవారు జాము ఐదు గంటలకు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వైకుంఠ ద్వారంలో రామయ్యను దర్శించుకోవడానికి సుదూర ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు భద్రాద్రి చేరుకున్నారు.

### ఆకట్టుకున్న రివర్ ఫెస్టివల్

వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా ఈసారి భక్తులకు కనువిందు చేయడానికి గోదావరి తీరంలో అధికారులు రివర్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా కుటీరాలు నిర్మించి గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ ద్వారా గిరిజన ఉత్పత్తులు విక్రయించడమే కాకుండా వారి వంటలను భక్తులకు రుచి చూపించారు. రివర్ ఫెస్టివల్ భక్తులను ఆకట్టుకుంది.

## వర్గ పోరుతో నిలిచిన శంకుస్థాపన పనులు

**భూమి పూజ కోసం అంతా సిద్ధం చేసిన కాంట్రాక్టర్**

**శంకుస్థాపన పనులను ఆపడంతో స్థానికుల మండిపాటు**



**మద్దూర్, జనవరి 9 (నిఘా న్యూస్):** వర్గ పోరుతో అభివృద్ధి పాలనులకు బ్రేక్ పడింది.దీంతో పలువురు నేతలు ఆందోళన కు గురుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో అప్పుడే వర్గాపోరు ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు. నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండలం లో కాంగ్రెస్ వర్గ పోరు తీవ్ర తరం అవుతుందని కార్యకర్తలు పలువురు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో తహసీల్దార్ ఆఫీస్ సమీపంలో ఐ బీ గెస్ట్ హౌస్ కు ప్రహరీ గోడకు కాడ నిధుల నుంచి రూ. 17 లక్షలు మంజూరయ్యాయి. గురువారం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు అధికారులు, కాంట్రాక్టర్ చంద్ పాషా అంతా సిద్ధం చేశారు. పలువురు నాయకులు, అధికారులు శంకుస్థాపనకు చేరుకున్నారు. ఐనా ఇంకో వర్గం నేతలు రాలేదని, శంకుస్థాపన పనులను నిలిపివేయడంతో పలువురు కార్యకర్తలు మండిపడుతున్నారు. అధికారులకు ఇటు ప్రజాప్రతినిధులకు అందరికీ సమాచారం ఇచ్చిన తదుపరి, వారు చెప్పిన సమయానికె ప్రహరీ గోడ భూమి పూజ పెట్టుకున్నానని కాంట్రాక్టర్ చెప్పుకొచ్చారు. శంకుస్థాపన పనులను నిలిపివేయడంతో వచ్చిన అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు వెనుదిరిగి వెళ్లిపోయారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com